Telugu Daily

వేములవాడ వార్త

మీకోసం మా అక్షరం

కరీంనగర్
సంపుటి 09
సంచిక: 55
శనివారం
28 నవంబర్
2026
పేజీలు: 08

Karimnagar, Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad www.vemulawadavaartha.in



ముంబై పగ్గాలు మళ్లీ హిట్‌మ్యాన్‌కే

- మూడేళ్ల విరామం తర్వాత కెప్టెన్‌గా రోహిత్ శర్మ పునరాగమనం
- హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు ట్రేడ్

8





ఎల్‌నినోను సమష్టిగా ఎదుర్కొందాం



- రాబోయే 8 నెలలు వర్షాలు కురిసే అవకాశం లేదు
- రైతులు ఒక పంటను త్యాగం చేస్తే పశుసంపదను కాపాడుకోవచ్చు
- పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక విధానం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, వీవీన్యూస్: ఎల్‌నినో ప్రభావంతో రాబోయే ఎనిమిది నెలలు వర్షాలు కురిసే అవకాశం లేదని, నీటి ఎద్దడిని సమష్టిగా ఎదుర్కోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వం వద్ద సరిపడా ఆహార ధాన్యాల నిల్వలున్నాయని, నీటి కొరతే ప్రధాన సమస్యగా మారనుందని తెలిపారు. రైతులను చైతన్యపరిచి పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై నిర్ణయాలు తీసుకునేలా కృషి చేస్తున్నామన్నారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026లో భాగంగా నిర్వహించిన తెలంగాణ క్లైమేట్ కాన్‌క్లేవ్ కార్యక్రమంలో శుక్రవారం సీఎం ప్రసంగించారు. కరువు నెమ్మదిగా మొదలై తీవ్ర ప్రభావం చూపుతుందని, ప్రస్తుతం చలికాలంలోనూ వేసవి పరిస్థితులు కనిపిస్తున్నాయని చెప్పారు. రైతులు ఒక పంటను త్యాగం చేస్తే పశుసంపదను కాపాడుకోవచ్చని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. పెట్టుబడులు, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తుందని రేవంత్‌రెడ్డి తెలిపారు. నిపుణుల సూచనలతో ప్రత్యేక విధానం రూపొందిస్తామన్నారు. తెలంగాణకు చెరువుల నిర్మాణం, సంరక్షణలో గొప్ప చరిత్ర ఉందని, ఆక్రమణలకు గురైన చెరువులను పునరుద్ధరించేందుకే హైడ్రాను ఏర్పాటు చేశామని చెప్పారు. హైదరాబాద్‌లో చెరువులు, నాలాల ఆక్రమణల వల్లే వర్షపు నీరు కాలనీల్లోకి చేరుతోందన్నారు. మూసీ నదిని పూర్తిస్థాయిలో పునరుజ్జీవింపజేస్తామని, పరీవాహక ప్రాంతాల్లోని నిరుపేదలకు ప్రత్యామ్నాయ వసతి కల్పిస్తున్నామని తెలిపారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా హైదరాబాద్ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రైజింగ్–2047 లక్ష్యాలతో రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ప్రకృతి పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలను శ్రీశ్రీ రవిశంకర్ అభినందించారు. చెరువుల పునరుద్ధరణ అత్యవసరమన్నారు. వాటర్‌మ్యాన్ రాజేంద్రసింగ్ మాట్లాడుతూ పరిశ్రమలకు శుద్ధి చేసిన మురుగునీటిని అందించాలని, చెరువుల ఆక్రమణలను తొలగించి పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. మూసీ పునరుజ్జీవనానికి తెలంగాణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక నమూనా రూపొందించాలని అన్నారు. సదస్సులో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పలువురు అధికారులు, పర్యావరణ, వ్యవసాయ రంగాల నిపుణులు పాల్గొన్నారు.

ట్రక్ పార్క్ భూముల వేలానికి గ్రీన్‌సిగ్నల్



5

- వేలం నిలిపివేయాలన్న పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు
- 3.15 ఎకరాల స్థలం ఈ–వేలానికి హెచ్‌ఎండీఏ ఏర్పాట్లు

పనులు కాకుండానే రుణమిచ్చారా? 5

- సెమ్ ఇండియా ఫ్యాబ్‌కు రూ.500 కోట్ల రుణంపై హైకోర్టు విస్మయం
- డిసెంబరు 4కు విచారణ వాయిదా

మహిళా కోటాకు సీట్ల పెంపు!



కొత్త డీలిమిటేషన్ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

- లోక్‌సభ, అసెంబ్లీల్లో సీట్ల సంఖ్య 50 శాతానికి పెంపు
- 850కి చేరనున్న లోక్‌సభ స్థానాలు
- దక్షిణాది ఆందోళనలకు పరిష్కారంగా కొత్త ప్రతిపాదనలు
- 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన • రాష్ట్రాల ప్రాతినిధ్య నిష్పత్తిలో మార్పు లేకుండా కసరత్తు • 2029 ఎన్నికల నుంచే 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలుకు లక్ష్యం

6

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో ప్రస్తుత స్థానాల సంఖ్యను 50 శాతం పెంచేందుకు రూపొందించిన కొత్త డీలిమిటేషన్ బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాలను గరిష్ఠంగా 850కి పెంచాలని ప్రతిపాదించింది. అన్ని రాష్ట్రాల్లోనూ ప్రస్తుత స్థానాలకు అదనంగా 50 శాతం సీట్లు కల్పించనున్నారు. ఈ ప్రక్రియలో రాష్ట్రాల మధ్య లోక్‌సభ ప్రాతినిధ్య నిష్పత్తి తగ్గకుండా చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి వ్యక్తమైన అభ్యంతరాలు, ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని కొత్త ప్రతిపాదనలను రూపొందించినట్లు తెలిపాయి. వచ్చే వారం జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టే అవకాశముంది.



డ్రగ్స్‌కు దూరంగా ఉండండి..

లక్ష్యాన్ని చేరుకోండి

- వ్యసనాలకు బానిసలైతే జీవితాలు, కుటుంబాలు చిన్నాభిన్నం
- డ్రగ్స్‌కు బానిసైన వారిని వెలివేయొద్దు.. అండగా నిలవండి
- యువతకు మెగాస్టార్ చిరంజీవి పిలుపు

హైదరాబాద్, వీవీన్యూస్: మాదకద్రవ్యాల మహమ్మారిని తరిమికొట్టేందు కు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ జీవిత లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టాలని యువతకు సూచించారు. కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' ముగింపు సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా 48ఏళ్ల క్రితం తనకు ఎదురైన అనుభవాన్ని చిరంజీవి గుర్తుచేసుకున్నారు. 22ఏళ్ల వయసులో నటన నేర్చుకుంటున్న సమయంలో చెన్నైలోని పాండీ బజార్‌లో కొందరు బీరు తాగాలని ఆహ్వానించారని, సినీ పరిశ్రమలో అవకాశాలు రావాలంటే పార్టీలు, ఇలాంటి అలవాట్లు అవసరమని చెప్పారని తెలిపారు. అయితే తనకు అలాంటి అలవాట్లు లేవని స్పష్టం చేసి అక్కడి నుంచి వచ్చేశానన్నారు. ఆ సమయంలో ఓ పెద్దాయన చెప్పిన మాటలు తన జీవితానికి దిశానిర్దేశం చేశాయని పేర్కొన్నారు. ఒక్కసారి అలవాటు చేసుకుంటే అది వ్యసనంగా మారి లక్ష్యాలను దెబ్బతీస్తుందని, కళ్లకు గంతలు కట్టిన గురంలా లక్ష్యంపైనే దృష్టి పెట్టాలని ఆయన ఇచ్చిన సలహాను పాటించానన్నారు. యువత సినిమా రంగంతోపాటు వైద్యం, ఇంజినీరింగ్, న్యాయ, శాస్త్ర, రాజకీయ రంగాల్లో రాణించి నిజమైన హీరోలుగా ఎదగాలని ఆకాంక్షించారు. స్నేహితుల ఒత్తిడితోనో, సరదా కోసమో 'ఒక్కసారే కదా' అని డ్రగ్స్ తీసుకోవడం మొదలుపెడితే క్రమంగా వ్యసనంగా మారుతుందని హెచ్చరించారు. అది వ్యక్తుల జీవితాలనే కాకుండా కుటుంబాలను కూడా దెబ్బతీస్తుందని అన్నారు. డ్రగ్స్‌కు తరువాయి 5లో..



విద్యుత్తు ప్రాజెక్టులకు అండగా నిలవండి

- రూ.25,096 కోట్ల ఆర్‌డీఎస్ఎస్ ప్రతిపాదనలకు 60 రోజుల్లో ఆమోదం ఇవ్వాలి: భట్టి విక్రమార్క

5



గురువాయూరప్పన్‌ను దర్శించుకున్న రాష్ట్రపతి ముర్ము

- కుమార్తెతో కలిసి ప్రత్యేక పూజలు
- సంప్రదాయ పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ అధికారులు

గురువాయూర్: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కేరళలోని ప్రసిద్ధ గురువాయూర్ శ్రీకృష్ణ ఆలయాన్ని శుక్రవారం సందర్శించారు. కుమార్తె నిత్యశ్రీ ముర్ముతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన దైవమైన గురువాయూరప్పన్‌కు ప్రార్థనలు చేసి, అర్చకుల నుంచి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ వివరాలను గురువాయూర్ దేవస్వం బోర్డు వెల్లడించింది. మధ్యాహ్నం 3.15 గంటలకు హెలికాప్టర్‌లో శ్రీకృష్ణ కళాశాల మైదానానికి చేరుకున్న రాష్ట్రపతి.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో శ్రీవత్సం అతిథి గృహానికి వెళ్లారు. దేవస్వం శాఖ మంత్రి కె. మురళీధరన్, బోర్డు ఛైర్మన్ ఏవీ గోపీనాథ్, ఇతర అధికారులు ఆమెకు స్వాగతం పలికారు. ఆలయ తూర్పు ద్వారం వద్ద తంత్రి పీసీ దినేశన్ నంబూద్రిపాద్, నిర్వహణ కమిటీ సభ్యుడు మల్లిశేరి పరమేశ్వరన్ నంబూద్రిపాద్ పూర్ణకుంభంతో సంప్రదాయబద్ధంగా ఆహ్వానించారు. ఆలయ ప్రాంగణంలోని నాలంబలంలోకి ప్రవేశించిన ముర్ము.. సోపానంలో ప్రార్థనలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఉప ఆలయాలను సందర్శించారు. దర్శనం అనంతరం మంత్రి మురళీధరన్ శ్రీకృష్ణుడి చెక్క విగ్రహాన్ని బహూకరించారు. దేవస్వం బోర్డు ఛైర్మన్ వేణుగానం చేస్తున్న శ్రీకృష్ణుడి రెండు అడుగుల విగ్రహంతోపాటు, ఆలయ బంగారు ఏనుగు అలంకరణ నమూనాను అందజేశారు. దర్శనం ముగించుకుని బయటకు వచ్చిన రాష్ట్రపతి తూర్పు ద్వారం వద్ద వేచి ఉన్న భక్తులకు అభివాదం చేసి, చేతులు ఊపుతూ పలకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్వం బోర్డు సభ్యులు, జిల్లా కలెక్టర్ శిఖా సురేంద్రన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాజస్థాన్ పంచాయతీ సమితుల్లో కాంగ్రెస్ విజయభేరి

- 419 ప్రధాన్ పదవుల్లో 255 కైవసం.. బీజేపీకి 105 స్థానాలు
- దాదాపు 61 శాతం పదవులతో హస్తం పార్టీ ఆధిక్యం
- ఆర్ఎల్పీకి 24, స్వతంత్రులకు 19 స్థానాలు

జైపూర్: రాజస్థాన్ పంచాయతీ సమితి ప్రధాన్ పదవుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. మొత్తం 419 పదవులకు జరిగిన ఎన్నికల్లో 255 స్థానాలను కైవసం చేసుకుంది. అధికార బీజేపీ 105 పదవులతో రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్ర ఎన్నికల సంఘం శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ (ఆర్ఎల్పీ) 24, స్వతంత్రులు 19, భారత ఆదివాసీ పార్టీ (బీఏపీ) 14, సీపీఎం రెండు పదవులను గెలుచుకున్నాయి. ఇప్పటివరకు ఫలితాలు వెలువడిన స్థానాల్లో కాంగ్రెస్‌కు దాదాపు 61 శాతం, బీజేపీకి 25 శాతం పదవులు దక్కాయి. గతవారం జరిగిన పంచాయతీ సమితి, జిల్లా పరిషత్ వార్డుల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఆధిక్యం ప్రదర్శించింది. పంచాయతీ సమితి సభ్యుల స్థానాల్లో కాంగ్రెస్ 3,701, బీజేపీ 2,181 సీట్లు గెలుచుకున్నాయి. జిల్లా పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 599, బీజేపీకి 301 స్థానాలు దక్కాయి.

నాలుగు జిల్లాల్లో డిసెంబరు 17న కౌంటింగ్

రాష్ట్రంలోని 41 జిల్లాల్లో 37 జిల్లాల పరిధిలో 7,543 పంచాయతీ సమితి, 1,275 జిల్లా పరిషత్ స్థానాలకు గతవారం ఓట్ల లెక్కింపు నిర్వహించారు. కోటా, బరన్, కరౌలి, శ్రీగంగానగర్ జిల్లాల్లో మాత్రం కౌంటింగ్‌ను డిసెంబరు 17కు వాయిదా వేశారు. ఈ నాలుగు జిల్లాల్లో ప్రస్తుత పంచాయతీరాజ్ సంస్థల ఐదేళ్ల పదవీకాలం వచ్చే నెలతో ముగియనుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ప్రధాన్‌ను ఎన్నుకునేది సభ్యులే

గ్రామీణ స్థానిక పాలనలో మూడు అంచెల వ్యవస్థలో పంచాయతీ సమితి మధ్యస్థాయి సంస్థగా పనిచేస్తుంది. గ్రామ స్థాయిలోని గ్రామ పంచాయతీలకు, జిల్లా స్థాయిలోని జిల్లా పరిషత్‌లకు మధ్య పరిపాలనా అనుసంధానంగా ఉంటుంది. వివిధ వార్డుల నుంచి పంచాయతీ సమితి సభ్యులను ప్రజలు నేరుగా ఎన్నుకుంటారు. ఆ సభ్యులే తమలో ఒకరిని ప్రధాన్‌గా, మరొకరిని ఉప ప్రధాన్‌గా ఎన్నుకుంటారు.

కొండపై దీపం వెలిగించాల్సిందే

- సుప్రీంకోర్టు ఆగ్రహం.. విజయ్ ప్రభుత్వానికి నోటీసులు
- ఆలయ ట్రస్టీ బోర్డు సస్పెన్షన్.. భద్రత సీఆర్‌పీఎఫ్‌కు
- ప్రధాన కార్యదర్శి వ్యక్తిగత హాజరుకు ఆదేశం



న్యూఢిల్లీ: కార్తీక దీపం వివాదంలో తమిళనాడు ప్రభుత్వంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గతంలో ఇచ్చిన ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని ప్రాథమికంగా అభిప్రాయపడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా పలువురు ఉన్నతాధికారులకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. మదురైలోని తిరుప్పరన్ కుండ్రం కొండపై ఉన్న దీపత్తూన్ (రాతి స్తంభం) వద్ద నవంబరు 28న సంప్రదాయ దీపం తప్పనిసరిగా వెలిగించాలని స్పష్టం చేసింది. ఆదేశాల అమలులో విఫలమైన పోలీసు యంత్రాంగం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. అరుల్మిగు సుబ్రమణ్యస్వామి ఆలయ ట్రస్టీ బోర్డును సస్పెండ్ చేసింది. ఆలయం, కొండ భద్రత బాధ్యతలను కేంద్ర రిజర్వ్ పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్)కు అప్పగించింది. జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విపుల్ ఎం. పంచోలీలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. ఈ వ్యవహారంలో అధికారుల మధ్య జరిగిన ఈ–మెయిల్స్, ఫోన్ కాల్స్, సందేశాల వివరాలతో అఫిడవిట్ సమర్పించాలని సూచించింది. సుప్రీంకోర్టు ఆదేశాలను ప్రభుత్వ అధికారులు ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘిస్తే ఉపేక్షించబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆదేశాలను పాటించాలా వద్దా అని నిర్ణయించే అధికారం ప్రభుత్వ కార్యనిర్వాహక వర్గానికి లేదని తేల్చిచెప్పింది. న్యాయస్థానం ఇచ్చిన ఆదేశం చర్చకు ఆహ్వానం కాదని, సుప్రీంకోర్టు మార్చేంతవరకు రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు, ప్రభుత్వ చట్టాల పరిధిలో పనిచేసే సంస్థలు తప్పనిసరిగా అమలు చేయాలని పేర్కొంది. న్యాయవ్యవస్థ అధికారాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 144 ప్రకారం దేశంలోని పౌర, న్యాయ అధికారులు సుప్రీంకోర్టుకు సహకరించాల్సి ఉంటుందని గుర్తుచేసింది.

నవంబరు 20న అనుమతి ఇచ్చినా..

తిరుప్పరన్‌కుండ్రం కొండపై దీపత్తూన్ వద్ద నవంబరు 24న కార్తీక దీపం వెలిగించేందుకు సుప్రీంకోర్టు నవంబరు 20న అనుమతించింది. అయితే ఆదేశాలున్నప్పటికీ ఆ రోజు ఉచ్చిపిళ్లయార్ మండపం వద్ద మాత్రమే దీపం వెలిగించి, దీపత్తూన్ వద్ద వెలిగించలేదు. దీంతో దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్లు, ఇతర దరఖాస్తులపై ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రధాన కార్యదర్శితోపాటు డీజీపీ, హిందూ మత, ధర్మాదాయ శాఖ కార్యదర్శి, కమిషనర్, మదురై జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్, ఎస్పీ, ఆలయ అధికారులకు నోటీసులు జారీ చేసింది. అధికారుల వ్యవహారశైలి తమిళనాడులో, కనీసం మదురై జిల్లాలోనైనా పరిపాలనా గందరగోళం నెలకొన్నట్లు ప్రాథమికంగా కనిపిస్తోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో పాటు హైకోర్టుకు ఇచ్చిన హామీని కూడా ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినట్లు రికార్డులు సూచిస్తున్నాయని పేర్కొంది.

వాదనలు.. ప్రతివాదనలు

పిటిషనర్ కార్తికేయన్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్. గురు కృష్ణకుమార్ వాదిస్తూ.. దీపత్తూన్ వద్ద దీపం వెలిగించేందుకు అనుమతించకూడదని తమిళనాడు ప్రభుత్వం ముందుగానే నిర్ణయించుకుందని ఆరోపించారు. ప్రభుత్వం సమర్పించిన ప్రాథమిక నివేదికలోనూ ఈ విషయం వెల్లడైందని పేర్కొన్నారు. దర్గా తరఫున న్యాయవాది దేవయాని గుప్తా హాజరయ్యారు. భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ.. దీపం వెలిగించే ప్రదేశానికి వెళ్లేందుకు అనుమతులపై ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదని ఆలయ ట్రస్టీలు ఏఎస్ఐకి తెలిపారని చెప్పారు. ఇది తీవ్రమైన కోర్టు ధిక్కరణతో పాటు అధికారుల అహంకారానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం మొదటి నుంచీ ఈ అంశాన్ని వ్యతిరేకిస్తోందని ఆరోపించారు. మదురై కలెక్టర్ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర నారాయణన్ ఈ వాదనలను ఖండించారు. ఏఎస్ఐ అధికారులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి సంప్రదింపులు జరిపామని తెలిపారు. తొలుత కోర్టు ధిక్కరణ జరిగిందా లేదా అన్నది పరిశీలించాలని కోరారు. పోలీసు కమిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదిస్తూ.. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా 5 వేల మందికి పైగా పోలీసులను మోహరించామని, నిషేధాజ్ఞలు విధించామని చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. పోలీసుల వాదన నిజమైన ఆందోళనా లేక మొసలి కన్నీళ్లా అన్నది పరిశీలిస్తామని వ్యాఖ్యానించింది.

కొండపై ఆలయం.. దర్గా

తిరుప్పరన్‌కుండ్రం కొండపై మురుగన్ స్వామికి అంకితమైన అరుళ్మిగు సుబ్రమణ్యస్వామి ఆలయంతో పాటు హజ్రత్ సుల్తాన్ సికందర్ బాదుషా ఔలియా దర్గా, మసీదు ఉన్నాయి. కొన్నేళ్లుగా కార్తీక దీపోత్సవాన్ని ఉచ్చిపిళ్లయార్ దీప మండపం వద్ద నిర్వహిస్తున్నారు. దర్గాకు సుమారు 50 మీటర్ల దూరంలోని దీపత్తూన్ వద్ద కూడా దీపం వెలిగించాలని బీజేపీ, హిందూ సంఘాలు, కొందరు భక్తులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ప్రస్తుత విచారణలో ప్రధాన వివాదంపై తాము విచారణ చేపట్టడం లేదని, నవంబరు 20న ఇచ్చిన ఆదేశాల అమలులో జరిగిన ఉల్లంఘనపైనే విచారణ పరిమితమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

ప్రధాని మోదీ హర్షం

- సుప్రీంకోర్టు ఆదేశాలపై ప్రధాని స్పందన
- 'వెట్రివేల్ మురుగనుక్కు ఆరోగరా' అంటూ ఎక్స్‌లో సందేశం

చెన్నై: మదురైలోని తిరుప్పరన్‌కుండ్రం కొండపై సంప్రదాయ దీపం వెలిగించాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. మురుగన్ స్వామిని స్మరిస్తూ 'వెట్రివేల్ మురుగనుక్కు ఆరోగరా' అంటూ శుక్రవారం 'ఎక్స్' వేదికగా సందేశం పోస్ట్ చేశారు. తమిళం, హిందీ భాషల్లోనూ ఇదే సందేశాన్ని పంచుకున్నారు. తిరుప్పరన్‌కుండ్రం కొండపై ఉన్న దీపత్తూన్ (రాతి స్తంభం) వద్ద నవంబరు 28న సంప్రదాయ దీపం వెలిగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ తీర్పు వెలువడిన కొన్ని గంటల్లోనే ప్రధాని స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

13 రంగాలకు 1601 నంబర్ సిరీస్

ఈ-కామర్స్ నుంచి ఆసుపత్రుల వరకు అవకాశం

- రూ.500 కోట్ల వార్షిక టర్నోవర్ ఉన్న సంస్థలకే అర్హత
- మోసపూరిత సేవా కాల్స్‌కు అడ్డుకట్టే లక్ష్యం



న్యూఢిల్లీ: గుర్తింపు పొందిన సంస్థల నుంచి వచ్చే సేవా, లావాదేవీల కాల్స్‌ను వినియోగదారులు సులభంగా గుర్తించేందుకు ఉద్దేశించిన 1601 నంబర్ సిరీస్‌ను మరో 13 రంగాలకు విస్తరిస్తూ భారత టెలికాం నియంత్రణ సంస్థ (ట్రాయ్) నిర్ణయం తీసుకుంది. ఈ–కామర్స్, రిటైల్, ఆసుపత్రులు, విమానయాన సంస్థలు, ఫుడ్ డెలివరీ, రైడ్ హైలింగ్ సంస్థలు సహా పలు రంగాలకు ఈ సదుపాయం కల్పించింది. అయితే నిర్దేశించిన అర్హతలు ఉన్న సంస్థలకే ఈ నంబర్లను కేటాయించనుంది. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో కనీసం ఒక ఏడాదిలో రూ.500 కోట్ల వార్షిక టర్నోవర్ సాధించిన సంస్థలు మాత్రమే అర్హులని ట్రాయ్ స్పష్టం చేసింది. డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు, టెలికాం సంస్థలు, ఆటోమొబైల్ విక్రయ, మరమ్మతు సేవలు, ట్రావెల్ ఏజెన్సీలు, రుణ సేవల సంస్థలకూ ఈ అవకాశం కల్పించింది. డీటీహెచ్, ఐపీపీవీ, హెచ్ఐటీఎస్ పంపిణీ సేవల సంస్థలకు గత 12 నెలల్లో ఏదైనా ఒక నెలలో కనీసం 10 లక్షల మంది చందాదారులు ఉండాలి. భారత చట్టాల ప్రకారం నమోదైన సంస్థలకే నంబర్లు కేటాయిస్తారు. సాధారణ పది అంకెల నంబర్లతో ఫోన్ చేసి, ప్రముఖ సంస్థల ప్రతినిధులమంటూ మోసాలకు పాల్పడుతున్నవారిని అడ్డుకోవడమే ఈ విధానం ఉద్దేశం. ధ్రువీకరించిన సంస్థలకు మాత్రమే 1601 నంబర్లు కేటాయిస్తారు. వీటిని ప్రచార కాల్స్‌కు ఉపయోగించడాన్ని పూర్తిగా నిషేధించారు. తొలి దశలో విద్యుత్, ఇతర వినియోగ సేవలు, లాజిస్టిక్స్, కొరియర్ రంగాలకు ఈ నంబర్ల కేటాయింపునకు అనుమతించిన ట్రాయ్.. తాజాగా రెండో దశలో మరిన్ని రంగాలను చేర్చింది. అర్హ సంస్థల నమోదు, నంబర్ల మార్పిడి ప్రక్రియను 180 రోజుల్లో పూర్తి చేయాలని టెలికాం సేవల సంస్థలను ఆదేశించింది. ప్రతి 15 రోజులకు అమలు పురోగతిపై నివేదిక ఇవ్వాలని, గడువు ముగిసిన 15 రోజుల్లో తుది నివేదిక సమర్పించాలని సూచించింది. అమలు తీరును సమీక్షించిన తర్వాత మరిన్ని రంగాలను చేర్చే అవకాశం ఉందని తెలిపింది.



భారత్-బంగ్లా బంధానికి హసీనా చిక్కుముడి!

- ఆమెకు ఆశ్రయం ఇవ్వడంపై ఢాకా అసంతృప్తి
- ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం పడుతోందని వ్యాఖ్య
- అప్పగింత ఒప్పందం ప్రకారం స్వదేశానికి రావాల్సిందే: బంగ్లా మంత్రి

ఢాకా: మాజీ ప్రధాని షేక్ హసీనా వ్యవహారం భారత్–బంగ్లాదేశ్ సంబంధాల్లో చిక్కుముడిగా మారిందని బంగ్లాదేశ్ వ్యాఖ్యానించింది. ఆమెకు భారత్ ఆశ్రయం కల్పించడం ఇరు దేశాల మధ్య సంబంధాలపై ఒత్తిడి పెంచుతోందని పేర్కొంది. హసీనాను స్వదేశానికి పంపలేకపోతున్న భారత్.. ఆమెకు ఆశ్రయం కల్పించడాన్ని సమర్థించుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటోందని అభిప్రాయపడింది. డిసెంబరు 16న హసీనా స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారన్న వార్తలపై భారత్ ఆచితూచి స్పందించిన నేపథ్యంలో బంగ్లాదేశ్ నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. 'భారత్–బంగ్లాదేశ్ సంబంధాల్లో హసీనా ఓ ముల్లులా మారారు. ఆమె వ్యవహారం ఇబ్బందికరంగా తయారైంది. భారత్ కూడా ఇదే విషయాన్ని ఇప్పుడిప్పుడే గుర్తిస్తోంది. హసీనా నేరస్థురాలు. ఇరు దేశాల మధ్య ఉన్న అప్పగింత ఒప్పందం ప్రకారం ఆమె స్వదేశానికి రావాల్సి ఉంటుంది. చేతులకు సంకెళ్లతో లేదా కట్టుదిట్టమైన భద్రత మధ్య ఆమె తిరిగి రావాల్సిందే' అని బంగ్లాదేశ్ విదేశాంగ సహాయ మంత్రి హుమాయున్ కబీర్ వ్యాఖ్యానించారు. హసీనా అంశంపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ ఇటీవల స్పందించారు. హసీనా స్వయంగా బంగ్లాదేశ్‌కు వెళ్లాలనుకోవడాన్ని, ఆమెను అప్పగించాలంటూ బంగ్లా ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని వేర్వేరు అంశాలుగా చూస్తున్నామని తెలిపారు. ఆమె అప్పగింతకు సంబంధించి ఉన్న న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తున్నట్లు స్పష్టం చేశారు.

అఫిడవిట్లతో పార్టీపై హక్కు సాధించలేరు: డెరెక్

న్యూఢిల్లీ: ఎమ్మెల్యేల సంఖ్య ఎక్కువగా ఉన్నంత మాత్రానో, భారీ సంఖ్యలో అఫిడవిట్లు సమర్పించినంత మాత్రానో పార్టీపై హక్కు నిరూపించలేరని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) స్పష్టం చేసింది. తిరుగుబాటు వర్గం సమర్పించిన అఫిడవిట్లు పోలీసు, ప్రభుత్వ అధికారుల సహకారంతో అక్రమంగా రూపొందించినవని ఆరోపించింది. పార్టీకి ఎవరు నిజమైన ప్రతినిధులో ఎన్నికల సంఘం (ఈసీ) తేల్చాలని టీఎంసీ జాతీయ సంయుక్త కార్యదర్శి డెరెక్ ఓబ్రెయిన్ అన్నారు. శుక్రవారం పీటీఐతో మాట్లాడుతూ.. అఫిడవిట్ల సంఖ్య కంటే వాటి విశ్వసనీయతే ముఖ్యమని పేర్కొన్నారు. అక్రమాలపై ఆధారాలను తగిన సమయంలో వెల్లడిస్తామని చెప్పారు. టీఎంసీ రాజ్యాంగం ప్రకారం పార్టీ అధ్యక్షురాలు, సంస్థాగత కమిటీల పదవీకాలం ఐదేళ్లని డెరెక్ గుర్తుచేశారు. చివరిసారిగా 2022లో సంస్థాగత ఎన్నికలు జరిగాయని, తదుపరి ఎన్నికలు 2027లో జరగాల్సి ఉందని తెలిపారు. జూన్ 22న తిరుగుబాటు వర్గం నిర్వహించిన సమావేశానికి పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ, కీలక నేతలను ఆహ్వానించలేదని, అలాంటప్పుడు సమాంతర సంస్థాగత నిర్మాణాన్ని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. మమత నాయకత్వంలో ఎన్నికల్లో పోటీ చేసి, ఇప్పుడు పార్టీపై హక్కు ఎలా కోరతారని నిలదీశారు. మమతా వర్గానికి 55 మంది ప్రజాప్రతినిధుల మద్దతు ఉందని టీఎంసీ వెల్లడించింది.

దిగ్బంధనాన్ని దాటే యత్నం.. నౌకపై అమెరికా దాడి

- ఇరాన్ నౌకాశ్రయం నుంచి బయల్దేరిన 'పసిఫిక్ ఆర్చర్'
- ఇంజిన్ ధ్వంసం.. సిబ్బందికి గాయాలు కాలేదన్న అమెరికా
- యుద్ధాన్ని మళ్లీ తీవ్రతరం చేసే అంశంపై ట్రంప్ సర్కారు కసరత్తు
- 158 వాణిజ్య నౌకలను వెనక్కి మళ్లించిన అగ్రరాజ్యం

వాషింగ్టన్: ఇరాన్ నౌకాశ్రయాలపై విధించిన నౌకా దిగ్బంధనాన్ని ఉల్లంఘించేందుకు ప్రయత్నించిన మరో వాణిజ్య నౌకపై అమెరికా సైన్యం దాడి చేసింది. ఒమన్ సింధుశాఖలో పలావు జెండాతో ప్రయాణిస్తున్న 'ఎంవీ పసిఫిక్ ఆర్చర్'ను గురువారం లక్ష్యంగా చేసుకున్నట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ శుక్రవారం ప్రకటించింది. సైనిక విమానం నుంచి ప్రయోగించిన కచ్చిత్వంతో లక్ష్యాన్ని ఛేదించే ఆయుధాలు నౌక వెనుక భాగాన్ని తాకడంతో ఇంజిన్ పనిచేయడం ఆగిపోయిందని వెల్లడించింది. నౌకలోని పౌర సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని తెలిపింది. సెంట్రల్ కమాండ్ వివరాల ప్రకారం.. ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ నౌకాశ్రయం నుంచి బయలుదేరిన పసిఫిక్ ఆర్చర్.. అమెరికా విధించిన దిగ్బంధనాన్ని దాటి వెళ్లేందుకు ప్రయత్నించింది. నౌకల ప్రయాణ వివరాలను నమోదు చేసే వెబ్‌సైట్లలో దాని గమ్యస్థానంగా సింగపూర్ నమోదైంది.

యుద్ధాన్ని మళ్లీ ప్రారంభించాలా?

ఇరాన్‌తో నెలల తరబడి కొనసాగుతున్న యుద్ధాన్ని తిరిగి తీవ్రతరం చేయాలా? వద్దా? అన్న అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సమాలోచనలు జరుపుతున్న తరుణంలో ఈ దాడి చోటుచేసుకుంది. ఫిబ్రవరి చివర్లో ప్రారంభమైన యుద్ధం.. గత కొన్ని నెలలుగా పెద్దగా ఘర్షణలు లేకుండా ప్రతిష్టంభనలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయాలంటూ ఇజ్రాయెల్ ఒత్తిడి పెంచుతోంది. నవంబరులో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు.. ఇరాన్‌పై యుద్ధాన్ని తిరిగి ప్రారంభించాలని లేదా ఆ దేశ అణు కేంద్రాలు, క్షిపణి సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు చేసేందుకు ఇజ్రాయెల్‌కు అనుమతించాలని అమెరికాను కోరినట్లు ప్రాంతీయ అధికారులు అసోసియేటెడ్ ప్రెస్‌కు వెల్లడించారు. మరోవైపు పర్షియన్ గల్ఫ్ దేశాలతోపాటు పాకిస్థాన్, టర్కియే ప్రభుత్వ, భద్రతా అధికారులు యుద్ధం మళ్లీ చెలరేగకుండా దౌత్య ప్రయత్నాలు చేస్తున్నారు. అమెరికా ఉన్నతాధికారులతో ఫోన్‌లో సంప్రదింపులు జరుపుతున్నారు. ట్రంప్ మాత్రం ఒకవైపు ఇరాన్‌పై మరిన్ని భారీ దాడులు చేస్తామని హెచ్చరిస్తూనే.. మరోవైపు సైనికపరంగా యుద్ధం దాదాపు ముగిసిందని చెబుతున్నారు.

158 నౌకలు వెనక్కి..

ఇరాన్ నౌకాశ్రయాలపై అమెరికా ఏప్రిల్ నుంచి దిగ్బంధనం కొనసాగిస్తోంది. వేసవిలో టెహ్రాన్‌తో చర్చల సందర్భంగా కొంతకాలం దీనిని నిలిపివేసి, జులైలో తిరిగి అమల్లోకి తెచ్చింది. అప్పటి నుంచి నిబంధనలు ఉల్లంఘించే వాణిజ్య నౌకలను అడ్డుకుంటున్నామని అమెరికా సైన్యం తెలిపింది. ఇప్పటివరకు 158 నౌకలను వెనక్కి మళ్లించినట్లు వెల్లడించింది. దిగ్బంధనం ప్రారంభమైన తర్వాత అమెరికా దాడి చేసి నిలిపివేసినట్లు ప్రకటించిన నౌకల్లో పసిఫిక్ ఆర్చర్ కనీసం 15వది. వేసవిలో దిగ్బంధనాన్ని తిరిగి అమల్లోకి తెచ్చిన తర్వాత ఇది ఆరో నౌక. అంతకుముందు నవంబరు 7న మరో నౌకను అడ్డుకుంది.

గతంలో ముగ్గురు భారతీయ నావికుల మృతి

అమెరికా దిగ్బంధనాన్ని తప్పించుకునేందుకు ప్రయత్నించిన గినియా–బిస్సావు జెండాతో ప్రయాణిస్తున్న చమురు నౌకపై జూన్‌లో జరిగిన దాడి తీవ్ర విమర్శలకు దారితీసింది. పలావు జెండాతో ప్రయాణిస్తున్న 'ఎంటీ సెట్టెబెల్లో' నౌకపై అమెరికా దళాలు జరిపిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించినట్లు అప్పట్లో భారత అధికారులు వెల్లడించారు. ఈ ఘటనను ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ అయిన అంతర్జాతీయ సముద్రయాన సంస్థ అధిపతి కూడా ఖండించారు. అయితే వాణిజ్య నౌకలపై కాల్పులు జరిపే ముందు అమెరికా దళాలు పలుమార్లు హెచ్చరికలు జారీ చేస్తాయని సెంట్రల్ కమాండ్ చెబుతోంది.

హోర్ముజ్‌లో మందుపాతర తాకిందన్న ఇరాన్

మరోవైపు హోర్ముజ్ జలసంధిలో అనుమతి లేని మార్గంలో ప్రయాణించేందుకు రెండు చమురు నౌకలు ప్రయత్నించాయని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ శుక్రవారం వెల్లడించింది. వాటిలో ఒకటి సముద్రపు మందుపాతరను ఢీకొనగా.. మరో నౌక వెనుదిరిగిందని పేర్కొంది. అయితే ఈ వాదనలను స్వతంత్రంగా ధ్రువీకరించలేదు. తమ అనుమతి లేకుండా కీలకమైన ఈ జల మార్గంలో ప్రయాణించవద్దని ఇరాన్ నౌకలను హెచ్చరిస్తోంది. అనుమతి లేని మార్గాల్లో వెళ్లేందుకు ప్రయత్నించే చమురు నౌకల సంఖ్య ఇటీవలి రోజుల్లో గణనీయంగా తగ్గిందని ప్రభుత్వ ప్రసార సంస్థ ద్వారా రివల్యూషనరీ గార్డ్స్ తెలిపింది.

చమురు రవాణాలో 20 శాతం కోత

హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతల ప్రభావం చమురు రవాణా పైనా పడుతోంది. రిస్టాడ్ ఎనర్జీ అంచనాల ప్రకారం.. నవంబరు తొలి రెండు వారాల్లో రోజువారీ చమురు రవాణా సుమారు 1.3 కోట్ల బ్యారెళ్లకు పడిపోయింది. అక్టోబరులో ఇది రోజుకు 1.5 కోట్ల నుంచి 1.6 కోట్ల బ్యారెళ్ల మధ్య ఉండేది. దీంతో దాదాపు 20 శాతం తగ్గుదల నమోదైంది. హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించేందుకు చమురు నౌకలు వెనుకాడేలా ఇరాన్ దాడులు చేయడం, సౌదీ అరేబియాలోని కీలక పైప్‌లైన్ ద్వారా ఎర్ర సముద్ర తీరంలోని యన్బు నౌకాశ్రయానికి చమురు రవాణా తగ్గడం ఇందుకు కారణాలని రిస్టాడ్ ఎనర్జీ పేర్కొంది. ఆ పైప్‌లైన్ పైనా పలుమార్లు దాడులు జరిగాయి. హోర్ముజ్, ఎర్ర సముద్రం, నల్ల సముద్రం, పనామా కాలువల్లో తలెత్తుతున్న అంతరాయాలతో అంతర్జాతీయ నౌకా రవాణా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని ఐక్యరాజ్యసమితి వాణిజ్య, అభివృద్ధి విభాగం నివేదిక వెల్లడించింది. ప్రయాణ సమయం పెరగడం, ఇంధన వ్యయాలు, నౌకాశ్రయాల్లో రద్దీ అధికమవుతున్నాయని తెలిపింది.





భూముల రీ సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్

బోయినపల్లి, వీవీన్యూస్: బోయినపల్లి మండలం మల్లాపూర్, వరదవెల్లి గ్రామాల్లో భూముల రీ సర్వే పండ్లు కొనసాగుతుండగా అదనపు కలెక్టర్ గడ్డం నరేష్ క్షేత్రస్థాయిలో శుక్రవారం పరిశీలించారు. భూముల రీ సర్వే పై ముందస్తుగా సమాచారం ఇవ్వాలని సూచించారు. రైతుల సమక్షంలో సర్వే చేసి.. వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటివరకు సేకరించిన ధాన్యం వివరాలను ఆరా తీసి, కొనుగోలు కేంద్రంలో రైతుల సౌకర్యార్థం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. రైతులకు కొనుగోలు కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, నిబంధనలకు అనుగుణంగా తేమ శాతం వచ్చిన ధాన్యం కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ షరీఫోద్దీన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు సిబ్బంది ఉన్నారు.



ఇందిరమ్మ బీమా నమోదు వేగవంతం చేయాలి

వేములవాడ, వీవీన్యూస్: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని వివిధ వార్డుల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియపై మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ లోకేష్, వార్డు అధికారులతో సమావేశమై నమోదు ప్రక్రియ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనం అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, స్థానిక కౌన్సిలర్ల సమన్వయంతో నమోదు ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పట్టణ ప్రజలు కూడా ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మేనేజర్ సంపత్ రెడ్డి, ఆర్ఐ రాజేందర్, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి పరామర్శ

వేములవాడ, వీవీన్యూస్: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలంలోని మారుపాక గ్రామానికి చెందిన తుమ్మల కిరణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, మనోధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో తుమ్మల రాజవ్వ, తుమ్మల సాయినాథ్, బీజేపీ వేములవాడ అర్బన్ మండల అధ్యక్షులు బుర్ర శేఖర్ గౌడ్, మాజీ మండల అధ్యక్షులు సురువు వెంకట్, మండల ప్రధాన కార్యదర్శి చంద్రగిరి ప్రశాంత్, మండల ఉపాధ్యక్షులు పోచంపల్లి భాను,బూత్ అధ్యక్షులు పడిగేల బాబు, పల్లెబోయిన నాగరాజు, సీనియర్ నాయకులు మూదాం శ్రీనివాస్, ముడికే శ్రీనివాస్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కంసాని రాము, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



చెల్లని చేనేత కార్డులపై విచారణ చేపట్టాలి: సీపీఐ

సిరిసిల్ల, వీవీన్యూస్: చేనేత జౌళి శాఖ కార్డుల జారీ, పింఛన్ల పంపిణీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం సిరిసిల్లలోని జౌళి శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి మాట్లాడుతూ.. చేనేత వృత్తిలో కొనసాగుతున్న వారికి గతంలో శాఖ జారీ చేసిన కార్డులను ఇప్పుడు చెల్లవని చెప్పి పింఛన్లకు దూరం చేయడం అన్యాయమన్నారు. మరోవైపు చేనేత వృత్తిలో లేని ఇతరులు సైతం కార్డులు పొంది పింఛన్లు పొందుతున్నారని ఆరోపించారు. కార్డుల జారీపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, అనర్హులను తొలగించి అర్హులకు న్యాయం చేయాలని, అక్రమాలకు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో రాపల్లి మధు, గణేష్, నరసయ్య, తిరుపతి, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

చంద్రంపేటకు మెరుగైన విద్యుత్ సరఫరా

- 2,100 కేవీఏ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

సిరిసిల్ల, వీవీన్యూస్: సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట ప్రాంతంలో విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని పెంచేందుకు 2,100 కేవీఏ సామర్థ్యం గల డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్)ను విద్యుత్ శాఖ అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. డివిజనల్ ఇంజినీర్ (ఆపరేషన్స్) అంజయ్య శుక్రవారం ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఛార్జింగ్ చేశారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి రావడంతో చంద్రంపేట ప్రాంత వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు వీలవుతుందని అధికారులు తెలిపారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు శాఖ నిరంతరం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.

హామీలు అమలు చేయలేక సర్కార్ విఫలం

- దీక్ష దివాస్ లో ప్రజలందరూ భాగస్వాములు కావాలి • బీఆర్ఎస్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఎల్. రమణ పిలుపు
- సిరిసిల్ల తెలంగాణ భవన్ లో న్యాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, పార్టీ శ్రేణులతో కలిసి మీడియా సమావేశం



సిరిసిల్ల, వీవీన్యూస్: కేసీఆర్ అంకుటిత దీక్షతోనే తెలంగాణ సాధ్యమైందని, ఈనెల 29న జరిగే 'దీక్షా దివాస్' స్ఫూర్తి సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ ఎల్. రమణ పిలుపునిచ్చారు. శుక్రవారం సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో కలిసి రమణ మాట్లాడారు. నేటి తరానికి, జెన్ జీ లకు కేసీఆర్ ఆమరణ దీక్ష, త్యాగం , ఉద్యమం, పోరాటం ఫలితం తెలిపేందుకే దీక్ష దివాస్ స్ఫూర్తి సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలు అమలు చేయలేక, పరిపాలన లో విఫలమయిందని, సిఎం రేవంత్ రెడ్డి సభలో మాట్లాడే తీరు ప్రజలు అసహ్యించుకుంటున్నారని, తిట్ల దండకంతో కేసిఆర్, కేటీఆర్, హరీష్ రావు వారి కుటుంబ సభ్యులను మూడేళ్లుగా తిడుతూ కాలయాపన చేస్తున్నాడని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు, డిక్లెరేషన్లు, 420 హామీలు అమలు చేయలేక కేసిఆర్ ను తిట్టడమే పని పెట్టుకున్నాడని, కేసిఆర్ సర్కార్ హయం లో పదేళ్లు అభివృద్ధి, సంక్షేమం, ప్రజలకు ఇవ్వని హామీలు సైతం అమలు చేశారని తెలిపారు. సిరిసిల్లలో కేటీఆర్ డైనమిక్ లీడర్ ఉన్నారని, సిరిసిల్ల ను ఉన్నతమైన స్థితిలో అభివృద్ధి చేసి చూపించారన్నారు. సబ్బండ వర్గాలు దీక్ష దివాస్ స్ఫూర్తి సభ కు తరలిరావాలని ఈ సందర్భంగా రమణ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ జిల్లా నుంచి 25వేల మంది పైగా దీక్ష దివాస్ కి తరలి వెళ్తున్నామని తెలిపారు. కేసీఆర్ దీక్ష దివాస్ స్ఫూర్తి సభ కు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని, భారీగా తరలివచ్చి, విజయవంతం చేయాలి కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మాజీ జడ్పీ చైర్మన్లు తుల ఉమా, అరుణ, పట్టణ పార్టీ అధ్యక్షులు జిందం చక్రపాణి, వివిధ మండల పార్టీ అధ్యక్షులు ఫ్యాక్స్ చైర్మన్లు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో బీఆర్ఎస్ ర్యాలీ

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన కరీంనగర్ అలుగునూర్ లో నిర్వహించనున్న 'చలో కరీంనగర్ – దీక్ష దివాస్ స్ఫూర్తి సభ' విజయవంతం కావాలని పార్టీ సిరిసిల్ల శాఖ అధ్యక్షులు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలో భారీ ప్రచార ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల శాఖ అధ్యక్షులు జిందం చక్రపాణి మాట్లాడుతూ దీక్షా దివాస్ అనేది తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని మలుపు తిప్పిన ఘట్టమని, స్వరాష్ట్రం కోసం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ ప్రాణాలను పణంగా పెట్టి సాగించిన నిరాహార దీక్ష ఇది తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతిక అని అన్నారు. భావితరాలకు స్ఫూర్తిదాయకమైన కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన నవంబర్ 29వ రోజును గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సంవత్సరం నవంబర్ 29న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ముఖ్య అతిథులుగా కరీంనగర్ అలుగునూర్ లో నిర్వహించనున్న 'దీక్ష దివాస్ స్ఫూర్తి సభ'ను విజయవంతం చేయాలని ప్రజలను ఆహ్వానిస్తూ శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోనీ గాంధీ చౌరస్తా నుండి పెద్ద బజార్ పాత బస్టాండ్–నేతన్న చౌరస్తా అంబేద్కర్ చౌరస్తా మళ్లీ గాంధీ చౌరస్తా వరకు దీక్ష దివాస్ స్ఫూర్తి సభకు ప్రజలను ఆహ్వానిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమా మాట్లాడుతూ నాటి సమైక్యాంధ్ర రాష్ట్రంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరిస్తూ కేసీఆర్ సాగించిన పోరాటాన్ని గుర్తు చేస్తూ నవంబర్ 29న జరిగే దీక్ష దివాస్ స్ఫూర్తి సభ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్ లు, కోఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- 101 మందికి రూ.31.54 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కరీంనగర్, వీవీన్యూస్: పేదల అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 101 మంది లబ్ధిదారులకు రూ. 31,54,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను శుక్రవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పేదవర్గాల అభ్యున్నతికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి కారణంగా పేదల భూములకు రక్షణ లేకుండా పోయిందని, కొత్త రేషన్ కార్డుల జారీ, కార్డుల్లో అదనపు పేర్ల నమోదు వంటి అంశాల్లోనూ నిర్లక్ష్యం జరిగిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కలను నెరవేరుస్తోందని, చేయూత పథకం కింద అర్హులైన దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులకు పెన్షన్లు అందిస్తోందని పేర్కొన్నారు. కొత్తగా మంజూరైన పెన్షన్ల సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, పోరండ్ల పీఏసీఎస్ చైర్మన్ గోపు తిరుపతిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ చెన్నబోయిన రవి, పలువురు పార్టీ నాయకులు, గ్రామాల సర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ జట్ల ఎంపిక ప్రక్రియను ప్రారంభించిన ఎమ్మెల్యే

మానకొండూర్ నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ లో 89 జట్లు తలపడనున్నాయి. ఈ జట్ల మధ్య మ్యాచ్‌ల షెడ్యూల్ ఖరారు చేసేందుకు ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో శుక్రవారం డ్రా నిర్వహించారు. ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జట్ల ఎంపిక ప్రక్రియను చేపట్టారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతోపాటు క్రీడాకారులకు తమ ప్రతిభను చాటుకునే అవకాశం కల్పించడమే టోర్నీ నిర్వహణ ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. డ్రా ప్రక్రియతో పోటీల నిర్వహణకు సంబంధించిన కీలక ఘట్టం పూర్తయింది. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్, తిమ్మాపూర్ సీఐ అనిల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, పోరండ్ల, బెజ్జంకి పీఏసీఎస్ చైర్మన్లు గోపు తిరుపతిరెడ్డి, ఒగ్గు దామోదర్, టోర్నీ నిర్వాహకుడు అనిల్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



నూతన రాష్ట్ర ఇన్‌చార్జితో ఆది శ్రీనివాస్ భేటీ

హైదరాబాద్, వీవీన్యూస్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల నూతన ఇన్‌చార్జిగా నియమితులైన బి.ఎం. సందీప్‌ను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఆది శ్రీనివాస్ వివరించారు. సామాజిక న్యాయం, అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయనకు తెలియజేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడం, ప్రజలకు పార్టీని మరింత చేరువ చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై ఇరువురూ చర్చించారు.



బెట్టింగ్ అప్పుల కోసం గొలుసు చోరీ

- బంధువైన మహిళను బెదిరించి బంగారం అపహరణ
- నిందితుడి అరెస్టు.. గొలుసు, బైక్, ఫోన్ స్వాధీనం


సిరిసిల్ల, వీవీన్యూస్: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై అప్పుల పాలైన ఓ యువకుడు.. వాటిని తీర్చేందుకు బంధువైన వృద్ధురాలి బంగారు గొలుసును దోచుకున్నాడు. ఈ ఘటనలో కోనరావుపేట మండలం పల్లె నిజామాబాద్‌కు చెందిన ముష్టం వెంకటేష్ (29)ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 18న కోదురుపాకకు చెందిన బొంగోని రాజవ్వ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో మంకీ క్యాప్ ధరించి చొరబడిన వెంకటేష్.. లైట్లు ఆర్పి ఆమెను బెదిరించి 10 గ్రాముల గొలుసు లాక్కెళ్లాడు. సాంకేతిక ఆధారాలతో నిందితుడిని కోదురుపాక ఎక్స్‌రోడ్డు వద్ద పట్టుకున్న పోలీసులు.. చోరీ సొత్తుతోపాటు బైక్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు వెల్లడించారు. యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు.

మాల మహానాడు కమిటీ ఏకగ్రీవం



వేములవాడ, వీవీన్యూస్: వేములవాడ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన మాల మహానాడు సమావేశంలో వేములవాడ డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతీయ మాల మహానాడు, జిల్లా మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా ఐక్యవేదిక అధ్యక్షుడు తుంగ శివరాజు సమక్షంలో నూతన కమిటీని ప్రకటించారు. డివిజన్ కన్వీనర్‌గా బొల్లం దేవరాజు, కో–కన్వీనర్‌గా నీరటి కిరణ్ కుమార్, యూత్ అధ్యక్షుడిగా రొండి మధుకర్,మీడియా ఇన్‌చార్జిగా సంటి రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా తిక్కల నవీన్ కుమార్, కన్వీనర్‌గా పందుగ నిరంజన్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తుంగ దేవరాజు మాట్లాడుతూ మాలలంతా ఐక్యంగా ఉంటూ హక్కుల సాధనకు కృషి చేయాలని, సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీ సంఘ అభివృద్ధికి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అనంతరం నూతన డివిజన్ కన్వీనర్ బొల్లం దేవరాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మాలల ఐక్యత, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు జక్కుల యాదగిరి, నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల కమలాకర్, జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్, చందుర్తి మండల అధ్యక్షుడు ఏసు కుమార్, కోనరావుపేట మండల అధ్యక్షుడు మందాల శ్రీనివాస్, వివిధ మండలాల ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహ స్వామి డీఎస్పీ నాగేంద్రచారి



రుద్రంగి, వీవీన్యూస్: రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రం గి లక్ష్మీ నరసింహ స్వామిని శుక్రవారం సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆలయ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, కోశాధికారి ఈర్ణం నవీన్ డిఎస్పీ దంపతులను శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. గత మూడు రోజులుగా స్వామివారి జాతర మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన కమిటీ సభ్యులకు ప్రజలకు అధికారులకు అభినందనలు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపితే ప్రాణాలకే ముప్పు

- డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి ఎస్పీ అవగాహన
- నిబంధనలు పాటిస్తామని వాహనదారులతో ప్రతిజ్ఞ

వేములవాడ, వీవీన్యూస్: మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వాహనదారుల్లో అవగాహన కల్పించాలని రాజ న్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి. గితే సూచించారు. ఈ మేరకు వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించా రు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి ఎస్పీ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపబోమని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతగా వ్యవహరిస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం వల్ల డ్రైవింగ్‌పై నియంత్రణ కోల్పోయి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. వాహనదారుడి నిర్లక్ష్యం అతడి ప్రాణాలతో పాటు రోడ్డుపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకూ ముప్పుగా మారుతుందని హెచ్చరించారు. మద్యం తాగి వాహనం నడపడం, అతివేగం, హెల్మెట్ ధరించక పోవడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, మైనర్ల డ్రైవింగ్ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకం కింద రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్య సేవలు పొందవచ్చన్నారు. జిల్లాలోని ఏడు ఆసుపత్రుల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి బాధితులను 'గోల్డెన్ అవర్'లో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడి న వారికి రహవీర్ పథకం కింద రూ.25 వేల నగదు ప్రోత్సాహకం అందిస్తారని తెలిపారు. ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని, మానవత్వంతో స్పందించి విలువైన ప్రాణాలను కాపాడాల ని ఎస్పీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐ వీరప్రసాద్, ఎస్సైలు ప్రేమానందం, శ్రీనివాస్, రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.











జర్మనీలోని ఎస్సెన్ నగరంలో ఏటా నిర్వహించే ఎస్సెన్ మోటర్ షో చూపరులను ఆకట్టుకుంది. ఐరోపాలోనే ప్రముఖ ఆటోమొబైల్ ప్రదర్శనల్లో ఒకటి. స్పోర్ట్స్ కార్లు, సూపర్ కార్లు, పాతకాలపు వాహనాలు, మోటార్ సైకిళ్లు, వాహనాల రూపురేఖలను మార్చే ట్యూనింగ్ నమూనాలు, మోటార్ స్పోర్ట్స్‌కు సంబంధించిన ప్రత్యేక వాహనాలను ఇందులో ప్రదర్శిస్తారు. ఈ ఏడాది నవంబర్ 27న ప్రివ్యూ డేతో ప్రారంభమైన ఈ ప్రదర్శన.. నవంబర్ 28 నుంచి డిసెంబర్ 6 వరకు కొనసాగనుంది. జర్మనీతో పాటు 19 దేశాలకు చెందిన 500కు పైగా సంస్థలు ఇందులో పాల్గొంటున్నాయి. ఈసారి ప్రదర్శనలో హాలీవుడ్ చిత్రాల సిరీస్ 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' కార్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ సినిమా సిరీస్ 25వ వార్షికోత్సవం సందర్భంగా మొత్తం 24 అసలైన చిత్ర వాహనాలను (20 కార్లు, నాలుగు మోటార్ సైకిళ్లు) ప్రదర్శనకు తీసుకొచ్చారు. వీటిలో '2 ఫాస్ట్ 2 ఫ్యూరియస్' చిత్రంలోని నాలుగు ప్రసిద్ధ కార్లు ప్రధాన ఆకర్షణగా ఉన్నాయి. బ్రియాన్ ఓ కానర్ పాత్ర ఉపయోగించిన 1999 నిస్సాన్ స్కైలైన్ జీటీ–ఆర్ ఆర్34, సుకీ పాత్రకు చెందిన గులాబీ రంగు హోండా ఎన్2000, స్లాప్ జాక్ కారు టయోటా సుప్రా, ఆరెంజ్ జూలియస్ కారు మాజ్డా ఆర్ఎక్స్–7లను ఒకేచోట చూడొచ్చు. వీటితోపాటు డాడ్జ్ ఛార్జర్, 'టోక్యో డ్రిఫ్ట్' చిత్రంలోని 'మోనా లిసా' కారుతో సహా ఇతర వాహనాలనూ ప్రదర్శిస్తున్నారు.







డ్రగ్స్‌కు దూరంగా ఉండండి.. లక్ష్యాన్ని చేరుకోండి

(మొదటిపేజీ తరువాయి)

బానిసలైన వారిని సమాజం చిన్నచూపు చూడకూడదని చిరంజీవి సూచించారు. మన పోరాటం మాదకద్రవ్యాలపైనే తప్ప, వాటికి బానిసలైన వ్యక్తులపై కాదన్నారు. అలాంటి వారికి అండగా నిలిచి, కౌన్సెలింగ్, పునరావాస కేంద్రాల ద్వారా సాధారణ జీవితంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి కలిగిన దేశంగా భారత్ ఉందని, యువత సరైన మార్గంలో నడిస్తే దేశ ప్రగతిని ఎవరూ అడ్డుకోలేరని చిరంజీవి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా పెట్టుకున్న డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణంలో భాగంగా కిషన్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలను అభినందించారు. తన 'స్టాలిన్' సినిమా సందేశం తరహాలో ఒక్కొక్కరు మరో ముగ్గురికి అవగాహన కల్పిస్తూ ఈ ఉద్యమాన్ని విస్తరించాలని సూచించారు. అనంతరం యువతతో కలిసి దేశాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

ఇన్‌స్టామార్ట్‌లో 340 మందికి ఉద్వాసన

- సంస్థాగత పునర్వ్యవస్థీకరణలో భాగంగా స్విగ్గీ నిర్ణయం
- జనరేటివ్ ఏఐతో పని విధానాల్లో మార్పులు
- బాధిత ఉద్యోగులకు అదనపు పరిహారం, ఆరోగ్య బీమా

న్యూఢిల్లీ: ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీకి చెందిన క్విక్ కామర్స్ విభాగం ఇన్‌స్టామార్ట్ సుమారు 340 మంది ఉద్యోగులను తొలగించింది. సంస్థాగత నిర్మాణాన్ని పునర్వ్యవస్థీకరించి, తదుపరి దశ వృద్ధికి సిద్ధమయ్యే క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. ప్రధానంగా కార్పొరేట్, సహాయక విభాగాల్లో ఈ తొలగింపులు జరిగాయి. జనరేటివ్ ఏఐ వినియోగం, మారుతున్న పని విధానాలకు అనుగుణంగా ఈ మార్పులు చేపట్టినట్లు తెలిపాయి. విభాగాల్లో ఒకే తరహా పనుల పునరావృత్తాన్ని తగ్గించడం, బాధ్యతలను స్పష్టం చేయడం, నిర్ణయాలు వేగంగా తీసుకునేలా చూడటం ఈ పునర్వ్యవస్థీకరణ లక్ష్యాలని పేర్కొన్నాయి. అయితే, దుకాణాలు, సరఫరా వ్యవస్థ, క్షేత్రస్థాయి సిబ్బందిపై పెట్టుబడులు కొనసాగుతాయని వివరించాయి. క్విక్ కామర్స్ రంగంలో పోటీ పెరుగుతున్న నేపథ్యంలో పాత వినియోగదారులతో అనుబంధాన్ని బలోపేతం చేసుకోవడంతోపాటు కొత్త వినియోగదారులను ఆకర్షించడంపై ఇన్‌స్టామార్ట్ దృష్టి సారించింది. 2026 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రికార్డు స్థాయిలో 12 లక్షల మంది నెలవారీ లావాదేవీల వినియోగదారులను చేర్చుకుంది. స్థూల ఆర్డర్ విలువ అంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే 16.7 శాతం పెరిగి రూ.9,230 కోట్లకు చేరింది.

ఉద్యోగులకు పరిహార ప్యాకేజీ

ఉద్యోగాలు కోల్పోయిన వారికి చట్టబద్ధంగా చెల్లించాల్సిన మొత్తానికి అదనంగా పరిహారం, ఈఎస్‌ఓపీల ముందస్తు వెస్టింగ్ వంటి ప్రయోజనాలను స్విగ్గీ కల్పించనుంది. 2027 మే వరకు ఆరోగ్య బీమా, వెల్‌నెస్ సబ్‌స్క్రిప్షన్లు కొనసాగించడంతో పాటు అర్హులకు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు సహాయం, కొత్త ఉద్యోగాల అన్వేషణలో తోడ్పాటు అందించనుంది. మూడు నెలలపాటు కెరీర్, నెట్‌వర్కింగ్ సేవలకు ప్రీమియం యాక్సెస్ కూడా కల్పించనుంది. సంస్థ వద్ద సెప్టెంబర్ త్రైమాసికం నాటికి సుమారు రూ.13,500 కోట్ల నగదు నిల్వలు ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

కరుణతోనే అధికారానికి సార్థకత

- శ్రీరాముడి జీవితం సమున్నత ఆదర్శాలకు ప్రతీక
- 'కరుణానాయక్ రామ్' పుస్తకావిష్కరణలో కేంద్ర మంత్రి షెకావత్

న్యూఢిల్లీ: కరుణతో కూడినప్పుడే అధికారం, శక్తికి అసలైన సార్థకత చేకూరుతుందని కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. కర్తవ్యనిష్ఠ, సున్నితత్వం మేళవించిన ఆదర్శ వ్యక్తిత్వం శ్రీరాముడిదని పేర్కొన్నారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాశ్ సత్యార్థి రచించిన 'కరుణానాయక్ రామ్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, భూటాన్ యువరాణి సోనమ్ డెచెన్ వాంగ్‌చుక్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. శ్రీరాముడు భారతీయ సంస్కృతి, ఆదర్శాలు, ప్రజాజీవితానికి స్ఫూర్తిప్రదాత అని షెకావత్ అన్నారు. వ్యక్తిని, సమాజాన్ని అనుసంధానించే సమష్టి చైతన్యానికి ఆయన ప్రతీకగా నిలుస్తారని చెప్పారు. శ్రీరాముడిని అర్థం చేసుకోవడమంటే భారతదేశాన్ని అర్థం చేసుకోవడమేనని వ్యాఖ్యానించారు. కరుణ, త్యాగం, ధర్మం, సామాజిక సామరస్యం, సర్వుల సంక్షేమం వంటి విలువలను శ్రీరాముడి జీవితం చాటిచెబుతుందని, ఆయన జీవన తత్వాన్ని పరిచయం చేయడంలో ఈ పుస్తకం కీలక ప్రయత్నమని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.



పేదలను ఆదుకొనేందుకు స్వచ్ఛంధ సంస్థల సహకారం:

- సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, వీవీన్యూస్: పేదలకు మంచి విద్య, వైద్య సేవలను అందించడమే తమ లక్ష్యమని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. ప్రముఖ స్వచ్ఛంధ సంస్థ 'వరల్డ్ విజన్ ఇండియా' ఆధ్వర్యంలో అడ్డగుట్టలో పేద విద్యార్థులకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని పద్మారావు గౌడ్ శుక్రవారం సాయంత్రం అడ్డగుట్ట కమ్యూనిటి హాల్ లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ పరంగా విద్యా సంస్థలను తీర్చుయిద్దయిదుతున్నామని తెలిపారు. సికింద్రాబాద్ పరిధిలో తొలి ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలను తామే ఏర్పాటు చేయించామని తెలిపారు. పేదలను ఆదుకొనేందుకు స్వచ్ఛంధ సంస్థలు ముందుకు రావాలని, తాము ప్రోత్సాహిస్తామని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. విజన్ వరల్డ్ మేనేజర్ టీ వీ కృష్ణ మాట్లాడుతూ సికింద్రాబాద్ లోని అన్ని మురికివాడల్లో తమ సంస్థ వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టిందని, అందుకు పద్మారావు గౌడ్ చొరవ ప్రశంసనీయమని పేర్కొన్నారు. సంస్థ ప్రతినిధులు అరుణ జ్యోతి, బాల మణి, శ్యాం మార్టిన్, బీ. ఆర్. ఎస్. నాయకులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

కొత్త డీలిమిటేషన్ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

- లోక్‌సభ, అసెంబ్లీల్లో సీట్ల సంఖ్య 50 శాతానికి పెంపు • 850కి చేరనున్న లోక్‌సభ స్థానాలు
- దక్షిణాది ఆందోళనలకు పరిష్కారంగా కొత్త ప్రతిపాదనలు • 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన
- రాష్ట్రాల ప్రాతినిధ్య నిష్పత్తిలో మార్పు లేకుండా కసరత్తు • 2029 ఎన్నికల నుంచే 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలుకు లక్ష్యం

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో ప్రస్తుత స్థానాల సంఖ్యను 50 శాతం పెంచేందుకు రూపొందించిన కొత్త డీలిమిటేషన్ బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాలను గరిష్ఠంగా 850కి పెంచాలని ప్రతిపాదించింది. అన్ని రాష్ట్రాల్లోనూ ప్రస్తుత స్థానాలకు అదనంగా 50 శాతం సీట్లు కల్పించనున్నారు. ఈ ప్రక్రియలో రాష్ట్రాల మధ్య లోక్‌సభ ప్రాతినిధ్య నిష్పత్తి తగ్గకుండా చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి వ్యక్తమైన అభ్యంతరాలు, ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని కొత్త ప్రతిపాదనలను రూపొందించినట్లు తెలిపాయి. వచ్చే వారం జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టే అవకాశముంది. కొత్త ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభతో పాటు రాష్ట్రాల శాసనసభల్లోనూ ప్రస్తుత స్థానాల సంఖ్యకు 50 శాతం అదనంగా సీట్లు పెరగనున్నాయి. పెరిగిన స్థానాలకు అనుగుణంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడతారు. ఈ ప్రక్రియకు 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాలని కేంద్రం నిర్ణయించింది. అయితే రాష్ట్రాల మధ్య లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న ప్రాతినిధ్య నిష్పత్తి యథాతథంగా కొనసాగేలా సీట్ల కేటాయింపు, నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ చేపట్టనున్నారు. 2051 వరకు స్థానాల సంఖ్యలో మార్పులు చేయకుండా స్తంభింపజేయాలని కూడా ప్రతిపాదించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ మార్పులతో పార్లమెంటు, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు మార్గం ఏర్పడనుంది. 2029 సార్వత్రిక ఎన్నికల నుంచే అమల్లోకి తీసుకురావాలన్నది కేంద్రం లక్ష్యం.



పాత బిల్లు స్థానంలో కొత్తది

గతంలో లోక్‌సభలో ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లు–2026 స్థానంలో డీలిమిటేషన్ (రెండో) బిల్లు–2026ను తీసుకురావాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు పాత బిల్లును ఉపసంహరించుకోనున్నట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ వెల్లడించారు. పాత ప్రతిపాదనల్లో కీలక మార్పులు చేసి కొత్త బిల్లును రూపొందించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా జనాభా అనే పదానికి ఉన్న నిర్వచనాన్ని తొలగించి, తాజా జనాభా లెక్కలు అనే పదానికి కొత్త నిర్వచనాన్ని చేర్చారు. అయితే ప్రస్తుత ప్రతిపాదనల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజనకు 2011 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా తీసుకోనున్నారు. కొత్త చట్టం అమల్లోకి వచ్చిన వెంటనే కేంద్రం డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ కమిషన్ సిఫారసుల మేరకు లోక్‌సభలో రాష్ట్రాల వారీగా స్థానాల సంఖ్య, శాసనసభల్లో మొత్తం స్థానాలు, నియోజకవర్గాల సరిహద్దులను ఖరారు చేయనున్నారు. మహిళలకు కేటాయించిన నియోజకవర్గాలను రొటేషన్ పద్ధతిలో మార్చే నిబంధనలూ కొత్త బిల్లులో ఉండనున్నాయి.

గతంలో వీగిన రాజ్యాంగ సవరణ

మహిళా రిజర్వేషన్ల అమలుకు డీలిమిటేషన్‌ను అనుసంధానిస్తూ కేంద్రం గత ఏప్రిల్‌లో పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. ఏప్రిల్ 16, 17 తేదీల్లో దీనిపై లోక్‌సభలో చర్చ జరిగినప్పటికీ.. అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో బిల్లు ఆమోదం పొందలేదు. దీంతో దానికి అనుబంధంగా ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లు–2026, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లులపై తదుపరి చర్యలు నిలిచిపోయాయి. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే లోక్‌సభ, రాజ్యసభల్లో విడివిడిగా మూడింట రెండొంతుల మెజారిటీ తప్పనిసరి. తాజా ప్రతిపాదనలతో బిల్లును తీసుకొస్తున్న కేంద్రం.. ఈసారి అవసరమైన మద్దతు లభిస్తుందని ఆశిస్తోంది. డీఎంకే, ఎన్సీపీతోపాటు బీఆర్ఎస్ కూడా బిల్లుకు మద్దతు ఇచ్చే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

విపక్ష ఇండియా కూటమి భేటీ

కొత్త డీలిమిటేషన్ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తున్న విపక్ష ఇండియా కూటమి శనివారం సమావేశం కానుంది. పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనుంది. నవంబర్ 30, డిసెంబర్ 1 తేదీల్లో లోక్‌సభలో, డిసెంబర్ 2, 3 తేదీల్లో రాజ్యసభలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం సేవా తీర్థ్‌లో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో కొత్త బిల్లుకు ఆమోదం లభించింది. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో దేశానికి కీలక బిల్లులు, అంశాలపై చర్చ జరగనుందని పేర్కొన్నారు.

కూటమి భేటీకి ఎన్సీపీ దూరం

పార్లమెంటు ప్రత్యేక సమావేశాలకు ముందు శనివారం జరగనున్న ఇండియా కూటమి విపక్ష పార్టీల భేటీకి ఎన్సీపీ (శరద్‌చంద్ర పవార్) వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే దూరంగా ఉండనున్నారు. తన తండ్రి, పార్టీ అధ్యక్షుడు శరద్ పవార్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు. వారాంతమంతా ముంబయిలోనే ఉండనున్నట్లు బారామతి ఎంపీ తెలిపారు. సోమవారం ఉదయం ఢిల్లీకి వెళ్లి పార్లమెంటు సమావేశాలకు హాజరవుతానని వాట్సాప్ స్టేటస్‌లో పేర్కొన్నారు. శరద్ పవార్ డీహైడ్రేషన్ సమస్యతో గురువారం దక్షిణ ముంబయిలోని ఓ ఆసుపత్రిలో చేరారు. మరోవైపు నవంబర్ 30 నుంచి లోక్‌సభలో జరిగే సమావేశాలకు తమ పార్టీ ఎంపీలంతా తప్పనిసరిగా హాజరుకావాలని ఎన్సీపీ (ఎస్పీ) శుక్రవారం విప్ జారీ చేసింది. డీలిమిటేషన్ బిల్లుపై బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఆ పార్టీ మద్దతు ఇవ్వవచ్చన్న ప్రచారం నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే బిల్లు ప్రవేశపెడితే ముందుగా దాని ముసాయిదాను పూర్తిగా పరిశీలించిన తర్వాతే తమ పార్టీ వైఖరిని వెల్లడిస్తామని సుప్రియా సూలే ఇప్పటికే స్పష్టం చేశారు.

పనులు మొదలుకాకుండానే రుణమా?

హైదరాబాద్, వీవీన్యూస్: సెమ్ ఇండియా ఫ్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎస్‌బీఐ రూ.500 కోట్ల రుణం మంజూరు చేసిన తీరుపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఫ్యాబ్‌సిటీలో సెమీకండక్టర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామంటూ ప్రభుత్వం నుంచి 100 ఎకరాల భూమి తీసుకున్న సంస్థ పనులు ప్రారంభించకపోవడంతో 78 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని గుర్తుచేసింది. అలాంటప్పుడు బ్యాంకు ఏ ప్రాతిపదికన అంత భారీ రుణం మంజూరు చేసిందో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంలో సీబీఐని ప్రతివాదిగా చేర్చుతూ తదుపరి విచారణను డిసెంబరు 4కు వాయిదా వేసింది. రుణం రికవరీ చర్యలకు ప్రభుత్వం అడ్డుపడకుండా ఆదేశాలు ఇవ్వాలన్న ఎస్‌బీఐ అభ్యర్థనపై జస్టిస్ నగేశ్ భీమపాక శుక్రవారం విచారణ చేపట్టారు. రూ.20 వేల కోట్ల పెట్టుబడి ప్రణాళికలో రూ.500 కోట్ల రుణం కేవలం 2.5 శాతమే అయినప్పటికీ, కనీసం రూ.10 వేల కోట్ల పెట్టుబడితోనైనా పనులు ప్రారంభించలేదని న్యాయమూర్తి పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో చూస్తే కేవలం ఓ షెడ్ మాత్రమే నిర్మించినట్లు ఉందని, అలాంటి సంస్థకు రూ.500 కోట్ల రుణం ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కంపెనీ ఆర్థిక పరిస్థితి, పనుల పురోగతిని పరిశీలించకుండా రుణం మంజూరు చేయడాన్ని తప్పుబట్టారు.

అసలేం జరిగింది?

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని ఫ్యాబ్‌సిటీ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లో మూడు దశల్లో 2.2 బిలియన్ డాలర్ల పెట్టుబడితో సెమీకండక్టర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని సెమ్ ఇండియా ఫ్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ 2007లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఇందుకోసం 100 ఎకరాల భూమిని లీజుకు తీసుకుంది. అయితే ఒప్పందం ప్రకారం పనులు ప్రారంభించకపోవడంతో 2010లో 78 ఎకరాలను స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం జీవో 9 జారీ చేసింది. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే 2011లో ఎస్‌బీఐ సంస్థకు రూ.500 కోట్ల రుణం మంజూరు చేసింది. తాకట్టు పెట్టిన భూమి ద్వారా రుణాన్ని రికవరీ చేసుకునేందుకు తాము చేపట్టే చర్యలకు ప్రభుత్వం అడ్డుపడకుండా ఆదేశించాలని కోరుతూ ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వం, టీజీఐఐసీ ఇచ్చిన నిరభ్యంతర పత్రాల (ఎన్‌వోసీ) ఆధారంగానే రుణం ఇచ్చామని బ్యాంకు తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే భూమి స్వాధీనాన్ని సవాలు చేస్తూ సెమ్ ఇండియా దాఖలు చేసిన పిటిషన్‌ను ఇదే హైకోర్టు కొట్టివేసిన విషయాన్ని న్యాయమూర్తి ప్రస్తావించారు. రుణం మంజూరు సమయంలో బ్యాంకు తగిన జాగ్రత్తలు తీసుకోలేదని, కేవలం పూచీకత్తునే ప్రాతిపదికగా చేసుకున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకున్న తర్వాత కూడా రుణం మంజూరు చేయడం, కంపెనీ పనుల్లో పురోగతి లేకపోవడం వంటి అంశాలను పరిశీలించాల్సి ఉందన్నారు. ఈ వ్యవహారంలో సీబీఐని ప్రతివాదిగా చేర్చిన నేపథ్యంలో సంబంధిత పత్రాలన్నింటినీ సీబీఐ తరఫు న్యాయవాదికి అందించాలని రిజిస్ట్రీని ఆదేశించారు. అనంతరం విచారణను డిసెంబరు 4కు వాయిదా వేశారు.

ట్రక్ పార్క్ భూముల వేలానికి గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, వీవీన్యూస్: కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలానికి తెలంగాణ హైకోర్టు లైన్ క్లియర్ చేసింది. ఈ భూముల విక్రయాన్ని నిలిపివేయాలని కోరుతూ దాఖలైన మూడు ప్రజాప్రయోజన వ్యాజ్యాలను (పిల్స్) ధర్మాసనం కొట్టివేసింది. దీంతో హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) చేపట్టనున్న ఈ-వేలానికి అడ్డంకులు తొలగాయి. కూకట్‌పల్లి మండలం మూసాపేట పరిధిలోని సుమారు 3.15 ఎకరాల ట్రక్ పార్క్ స్థలాన్ని వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ భూమిని ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు విక్రయించకుండా ట్రక్ పార్కింగ్ కోసమే వినియోగించాలని కోరుతూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సామాజిక కార్యకర్త మాధవరం కాంతారావు, ట్రక్ పార్క్ అసోసియేషన్ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించాయి. ప్రజాప్రయోజనం కోసం సేకరించిన ఈ స్థలాన్ని కంచె వేసి పరిరక్షించాలని పిటిషనర్లు కోరారు.

విద్యుత్తు ప్రాజెక్టులకు కేంద్రం అండగా నిలవాలి

- రూ.25,096 కోట్ల ఆర్‌డీఎస్ఎస్ ప్రతిపాదనలకు 60 రోజుల్లో ఆమోదం ఇవ్వాలి
- పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు మెగావాట్‌కు రూ.కోటి చొప్పున సాయం అందించాలి
- విద్యుత్తు ప్రసార వ్యవస్థకు జాతీయ హోదా కల్పించాలి: భట్టి విక్రమార్క

న్యూఢిల్లీ: తెలంగాణలో పెరుగుతున్న విద్యుత్తు అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర విద్యుత్తు, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ అధ్యక్షతన జరిగిన రాష్ట్రాల విద్యుత్తు శాఖ మంత్రుల సదస్సులో ఆయన పాల్గొని రాష్ట్ర అవసరాలను వివరించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్తు పంపిణీ నష్టాల తగ్గింపు, బకాయిల వసూళ్లు, విద్యుత్తు నిల్వ సామర్థ్యం పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ లక్ష్యాల కోసం పునరుద్ధరించిన పంపిణీ రంగ పథకం (ఆర్‌డీఎస్ఎస్) కింద రూ.25,096 కోట్ల విలువైన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ)కి సమర్పించామని, వాటికి 60 రోజుల్లో ఆమోదం ఇవ్వాలని కోరారు. 92 గిగావాట్ అవర్ల విద్యుత్తు నిల్వ సామర్థ్యం కోసం రూ.14,500 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) అందించాలని కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించారు. అయితే ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్తు ఉత్పత్తి సంస్థలు చేపట్టే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు ఈ నిధులు అందే అవకాశం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు చేపట్టే ఇలాంటి ప్రాజెక్టులకు మెగావాట్‌కు రూ.కోటి చొప్పున ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. టీజీ జెన్‌కో ప్రతిపాదించిన కల్లూరు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు కేంద్ర విద్యుత్తు ప్రాధికార సంస్థ (సీఈఏ) ఆమోదం లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టెండర్ల దశలో ఉన్న 2,000 మెగావాట్ అవర్ల బ్యాటరీ విద్యుత్తు నిల్వ ప్రాజెక్టులకూ ఆర్థిక సాయం అందించాలని సూచించారు.



ప్రసార ఛార్జీల విధానంలో మార్పులు చేయాలి

అంతరాష్ట్ర విద్యుత్తు ప్రసారానికి సంబంధించి జనరల్ నెట్‌వర్క్ యాక్సెస్ (జీఎన్ఏ) విధానానికి తెలంగాణ మద్దతు ఇస్తోందని భట్టి తెలిపారు. అయితే రాష్ట్రానికి కేటాయించిన 5,801 మెగావాట్ల నెట్‌వర్క్ యాక్సెస్‌లో మార్పు లేకున్నా, 2025 అక్టోబరులో రూ.195 కోట్లు, నవంబరులో రూ.145 కోట్ల ప్రసార ఛార్జీలు విధించారని వివరించారు. రాష్ట్రాల వారీగా ఈ ఛార్జీల వివరాలను ప్రతినెలా వెల్లడించాలని, మెగావాట్‌కు వార్షిక ప్రాతిపదికన ఛార్జీలు నిర్ణయించి ఏడాదికోసారి సర్దుబాటు చేసే విధానం తీసుకురావాలని కోరారు. దక్షిణ భారతదేశానికి 6,000 మెగావాట్ల విద్యుత్తును అందించే రాయ్‌గఢ్–పుగలూర్–త్రిస్సూర్ హెచ్‌వీడీసీ ప్రసార వ్యవస్థకు పూర్తిస్థాయి జాతీయ హోదా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర విద్యుత్తు ప్రాధికార సంస్థ ఆమోదించిన విద్యుత్తు వసరుల ప్రణాళిక ప్రకారం రాష్ట్రాలు సమకూర్చుకునే విద్యుత్తు సామర్థ్యానికి 2030 మార్చి 31 వరకు ప్రసార ఛార్జీల మినహాయింపును పొడిగించాలని కేంద్రాన్ని కోరారు.

డప్పు కొడుతూ.. కోలాటమాడుతూ.. డ్రగ్స్‌పై అవగాహన!

- నషా ముక్త్ భారత్‌లో జూటూరు కీర్తిరెడ్డి సందడి


హైదరాబాద్, వీవీన్యూస్: మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యతని, భావితరాలకు అందించగలిగే గొప్ప ఆస్తి అదే అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జూటూరు కీర్తిరెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేపట్టిన 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' పాదయాత్రలో భాగంగా శుక్రవారం మైత్రీవనం వద్ద ఆమె పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులు, స్థానికులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. పాదయాత్రలో డప్పు వాయిస్తూ, స్థానిక మహిళలతో కలిసి కోలాటం ఆడుతూ కీర్తిరెడ్డి ఉత్సాహం నింపారు. యువతను లక్ష్యంగా చేసుకుని కొన్ని విదేశీ శక్తులు మాదకద్రవ్యాలకు అలవాటు చేస్తున్నాయని, ఈ ప్రమాదాన్ని అడ్డుకోవడానికి కేంద్ర ప్రభుత్వం నషా ముక్త్ భారత్ కార్యక్రమానికి పిలుపునిచ్చిందని పేర్కొన్నారు. డ్రగ్స్ వినియోగం, సరఫరాను అరికట్టడం పోలీసులకో, ప్రజాప్రతినిధులకో మాత్రమే సాధ్యం కాదని.. ప్రజలంతా భాగస్వాములైనప్పుడే మాదకద్రవ్య రహిత భారత్ సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు.



రాజన్న ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్

వేములవాడ, వీవీన్యూస్: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని వీటీడీఏ వైస్ చైర్‌పర్సన్, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె ఆలయ పరిసరాల్లో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేములవాడ ఆలయ ప్రాంత అభివృద్ధి సంస్థ (వీటీడీఏ) ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రధాన ఆలయ విస్తరణ, నిత్యాన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కృష్ణ శిలలతో నిర్మిస్తున్న తూర్పు రాజగోపురం పనులతోపాటు అనివేటి మండపం, ఆలయ కోనేరు వద్ద చేపట్టనున్న పనులను ఆర్అండ్‌బీ, ఆలయ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రధాన ఆలయ విస్తరణతోపాటు ఇతర అభివృద్ధి పనులన్నీ నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పనుల్లో వేగం పెంచాలని, అవసరమైన మేరకు కార్మికుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ, నిత్యాన



కొత్త నెల.. కొత్త వాతలు!

డిసెంబర్‌లో సామాన్యుల జేబుపై అదనపు భారం

- వాహన కొనుగోలుదారులకు షాక్
- డిసెంబరు 1 నుంచి టాటా, హ్యుందాయ్ కార్ల ధరల పెంపు
- ఎస్‌బీఐ కార్డుపై అదనపు భారం
- గ్యాస్ ధరల సమీక్షతో సామాన్యుల్లో ఆందోళన
- విమాన ఇంధన ధరలపై కొనసాగుతున్న ఉత్కంఠ
- కమోడిటీ మార్కెట్లో మారనున్న మార్జిన్ విధానం

నెల మారితే చాలు.. ఖర్చుల లెక్కలు మారిపోతున్నాయి. డిసెంబరు ప్రారంభం నుంచే కొన్ని వస్తువులు, సేవల ధరలు సామాన్యుడికి భారంగా మారనున్నాయి. కొత్త కారు కొనాలనుకునేవారికి ధరల పెంపు షాక్ ఇవ్వనుండగా, ఎన్‌బీఐ క్రెడిట్ కార్డు వినియోగదారులపై అదనపు ఛార్జీల భారం పడనుంది. గ్యాస్ సిలిండర్లు, విమాన ఇంధనం ధరల సమీక్ష పైనా ఉత్కంఠ నెలకొంది.

కొత్త నెల.. కొత్త ఖర్చులు! నవంబరు ముగిసి డిసెంబరు ప్రారంభం కానుండగా సామాన్యుల జేబుపై అదనపు భారం పడనుంది. ముఖ్యంగా కొత్త కారు కొనాలనుకునేవారికి ధరల పెంపు రూపంలో షాక్ తగలనుంది. టాటా మోటార్స్, హ్యుందాయ్ సంస్థలు డిసెంబరు 1 నుంచి కార్ల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. మరోవైపు ఎన్‌బీఐ క్రెడిట్ కార్డు వినియోగదారులకు కొన్ని లావాదేవీలపై అదనపు ఛార్జీలు అమల్లోకి రానున్నాయి. ప్రతినెలా ఒకటో తేదీన జరిగే సమీక్షలో భాగంగా వంటగ్యాస్ సిలిండర్లు, విమాన ఇంధనం ధరల్లోనూ మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. వీటితోపాటు కమోడిటీ మార్కెట్ ట్రేడింగ్ నిబంధనల్లోనూ మార్పులు రానున్నాయి. డిసెంబరు తొలి రోజు నుంచి సామాన్యుల బడ్జెట్‌పై ప్రభావం చూపనున్న ముఖ్యమైన అంశాలివీ..

– హైదరాబాద్, వీవీన్యూస్



టాటా, హ్యుందాయ్ కార్లు ప్రియం

కొత్త కారు కొనుగోలు చేయాలనుకునేవారికి డిసెంబరు 1 నుంచి అదనపు ఖర్చు తప్పనుంది. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ తన కార్లు, ఎస్‌యూవీల ధరలను సగటున 0.5 శాతం పెంచనుంది. ఈ పెంపు పెట్రోల్, డీజిల్ వాహనాలతోపాటు ఎలక్ట్రిక్ కార్లకూ వర్తించనుంది. అయితే మోడల్, వేరియంట్‌ను బట్టి ధరల పెంపులో వ్యత్యాసం ఉంటుంది. పెరుగుతున్న ముడిసరుకుల ధరలు, ఉత్పత్తి వ్యయాలను కొంతమేర భర్తీ చేసుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. మరోవైపు హ్యుందాయ్ మోటార్ ఇండియా ఎంపిక చేసిన మోడళ్లు, వేరియంట్ల ధరలను గరిష్ఠంగా రూ.8,000 వరకు పెంచనుంది. ఈ రెండు సంస్థల ధరల పెంపు డిసెంబరు 1 నుంచే అమల్లోకి రానుంది.



గుదిబండలా మారనుందా?

ప్రతినెలా ఒకటో తేదీన చమురు మార్కెటింగ్ సంస్థలు వంటగ్యాస్ ధరలను సమీక్షిస్తాయి. ఈ నేపథ్యంలో డిసెంబరు 1న గృహావసరాలకు వినియోగించే 14.2 కిలోల సిలిండర్, వాణిజ్య అవసరాలకు ఉపయోగించే 19 కిలోల సిలిండర్ ధరల్లో మార్పులు ఉండొచ్చు. ముఖ్యంగా వాణిజ్య సిలిండర్ ధర పెరిగితే హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వహణ వ్యయాలు పెరుగుతాయి. దాని ప్రభావం ఆహార పదార్థాల ధరలపైనా పడే అవకాశం ఉంటుంది. అయితే డిసెంబరు నెలకు సంబంధించిన కొత్త ధరలను చమురు సంస్థలు ఇంకా ప్రకటించలేదు. అందువల్ల సిలిండర్ల ధరలు పెరుగుతాయా? తగ్గుతాయా? అనేది ప్రస్తుతానికి స్పష్టత లేదు.

ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుపై అదనపు ఛార్జీలు

ఎన్‌బీఐ క్రెడిట్ కార్డు వినియోగదారులపైనా డిసెంబరు నుంచి అదనపు భారం పడనుంది. కొన్ని రవాణా, ఇంధన లావాదేవీలపై ఒక శాతం అదనపు ఛార్జీ విధించనున్నారు. ఒక ఆర్థిక కలిగిన రవాణా లావాదేవీ విలువ రూ.30,000 దాటితే ఆ లావాదేవీపై ఒక శాతం ఛార్జీ పడుతుంది. ఒక బిల్లింగ్ సైకిల్‌లో ఆర్థిక కలిగిన ఇంధన కొనుగోళ్ల మొత్తం రూ.50,000 దాటితే ఇంధన ఖర్చులపై ఒక శాతం అదనపు ఛార్జీ విధిస్తారు. ఉదాహరణకు రవాణా సేవల కోసం రూ.35,000 చెల్లిస్తే రూ.350 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇంధన కొనుగోళ్లు రూ.60,000 అయితే రూ.600 అదనపు ఛార్జీ పడుతుంది. దీనికి వర్తించే పన్నులు అదనం. అయితే ఈ నిబంధనలు అన్ని క్రెడిట్ కార్డు లావాదేవీలకు వర్తించవు. నిర్దేశించిన పరిమితులు దాటిన ఆర్థిక కలిగిన లావాదేవీలకే వర్తిస్తాయి.

- కమోడిటీ మార్కెట్లో ట్రేడింగ్ చేసే వారికి సెబీ (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) కొత్త మార్జిన్ విధానాన్ని తీసుకొస్తోంది. డిసెంబరు 1 నుంచి వ్యవసాయ, వ్యవసాయేతర కమోడిటీ డెరివేటివ్స్ విభాగాల్లో ధరల ఒడుదొడుకుల ఆధారంగా కనీస ప్రారంభ మార్జిన్ నిర్ణయించనున్నారు. తక్కువ ఒడుదొడుకులున్న కమోడిటీలకు 6 శాతం, మధ్యస్థ ఒడుదొడుకులున్న వాటికి 8 శాతం, అధిక ఒడుదొడుకులున్న వాటికి 10 శాతం. ఈ నిబంధనలు వ్యవసాయ, వ్యవసాయేతర కమోడిటీలకు వర్తిస్తాయి. మార్కెట్‌లో రిస్క్‌ను మెరుగ్గా నిర్వహించేందుకు ఈ మార్పులు చేపట్టారు. ఈ విధానం ఏడాది పాటు అమల్లో ఉండనుంది.
- డిసెంబరు 1 నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయంటూ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అంతర్జాతీయ ముడిచమురు ధరలు, రూపాయి మారకం విలువ, చమురు సంస్థల నిర్ణయాల ఆధారంగా వీటి ధరల్లో మార్పులు ఉంటాయి.
- విమానయాన సంస్థలకు ప్రధాన నిర్వహణ వ్యయాల్లో విమాన ఇంధనం (ఏటీఎఫ్) ఒకటి. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు, డాలర్‌తో రూపాయి మారకం విలువ ఆధారంగా ఏటీఎఫ్ ధరల్లో మార్పులు చోటుచేసుకుంటాయి. ప్రతినెలా ఒకటో తేదీన ఈ ధరలను సమీక్షిస్తారు. డిసెంబరు 1న ఏటీఎఫ్ ధర పెరిగితే విమాన యాన సంస్థల నిర్వహణ ఖర్చులు అధికమవుతాయి. తద్వారా విమాన టికెట్ల ధరలపై కూడా పరోక్ష ప్రభావం పడే అవకాశం ఉంటుంది. అయితే టికెట్ ధరలు పెరుగుతాయని ఇప్పుడే చెప్పలేం.



రెహమాన్ నటుడిగా.. 16 గెటప్పుల్లో యోగిబాబు

నటుడిగా ఏఆర్ రెహమాన్.. 16 విభిన్న గెటప్పుల్లో యోగిబాబు.. ప్రభుదేవా స్టైలిష్ డ్యాన్స్‌లు.. వెరసి నవ్వులు, వినోదం, సంగీతం కలగలిసిన 'మూన్‌వాక్' ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచుతోంది. ప్రభుదేవా ప్రధాన పాత్రలో మనోజ్ ఎన్ఎస్ దర్శకత్వం వహించిన ఈ కామెడీ ఎంటర్‌టైనర్ ట్రైలర్‌ను చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. ఇందులో రెహమాన్ కోపిష్టి సినీ దర్శకుడిగా అతిథి పాత్రలో కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో ప్రభుదేవా 'బబూటీ' అనే విభిన్నమైన పాత్రలో నటించారు. ఆయన జీవితంలో నగ్మా, స్మిత అనే ఇద్దరు మహిళలు, ఓ స్నేహితుడు, విచిత్ర ప్రవర్తన కలిగిన మామగారు చుట్టూ కథ సాగనున్నట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. యోగిబాబు అత్త, మామ పాత్రలతో పాటు మొత్తం 16 గెటప్పుల్లో కనిపించి నవ్వులు పంచనున్నారు. ప్రభుదేవా తనదైన డ్యాన్స్ మూమెంట్స్ తోనూ ఆకట్టుకున్నారు. దాదాపు 30 ఏళ్ల తర్వాత తాను, ఏఆర్ రెహమాన్ కలిసి పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రం కోసం పని చేశామని ప్రభుదేవా తెలిపారు. 'మూన్‌వాక్' అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే కుటుంబ కథా చిత్రమని, సెలవుల్లో కుటుంబ సమేతంగా చూసి ఆనందించవచ్చని ట్రైలర్ విడుదల సందర్భంగా పేర్కొన్నారు. బిహైండ్‌వుడ్స్ ప్రొడక్షన్స్ పతాకంపై మనోజ్ ఎన్ఎస్, దివ్య మనోజ్, ప్రవీణ్ ఎలక్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అజు వర్గీస్, అర్జున్ అశోకన్, సాట్జ్, నిష్మా, సుస్మిత, రెడిన్ కింగ్స్లీ, మొట్టై రాజేంద్రన్ తదితరులు నటించారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించగా, అనూప్ వి. శైలజ సినిమాటోగ్రఫీ, శేఖర్ విజే, పీయూష్ షాజియా కొరియోగ్రఫీ బాధ్యతలు నిర్వహించారు. దీపావళికి విడుదల కావాల్సిన ఈ సినిమా వాయిదా పడింది. తాజాగా డిసెంబరు 24న క్రిస్మస్ కానుకగా తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. రోమియో పిక్చర్స్ ప్రపంచవ్యాప్త పంపిణీ హక్కులను, లహరి మ్యూజిక్ ఆడియో హక్కులను సొంతం చేసుకున్నాయి.





ఒకే తరహా కథలకు దూరం..

– మీనాక్షి చౌదరి

ఒకే తరహా పాత్రలు, కథలతో ప్రేక్షకుల ముందుకు రావడం తనకు ఇష్టం లేదని, నటిగా కొత్త ప్రయోగాలు చేస్తూ కంఫర్ట్ జోన్ దాటి వెళ్లడమే లక్ష్యంగా పెట్టుకున్నానని కథానాయిక మీనాక్షి చౌదరి తెలిపింది. ప్రతి పాత్రను ఓ నవలగా తీసుకుని అంకితభావంతో పనిచేస్తానని చెప్పింది. నాగచైతన్యతో కలిసి నటించిన 'వృషకర్మ' సినిమా డిసెంబరు 4న విడుదల కానున్న నేపథ్యంలో శుక్రవారం ఆమె పాత్రికేయులతో మాట్లాడింది. 'వృషకర్మ'లో దక్ష అనే ఆర్కియాలజీ విద్యార్థిని పాత్రలో కనిపిస్తానని మీనాక్షి వెల్లడించింది. ఆర్కియాలజీలో థీసిస్ చేసే అమ్మాయిగా తన పాత్ర సాగుతుందని, ఇప్పటివరకు వచ్చిన హారర్, మిథికల్ థ్రిల్లర్ చిత్రాలకు భిన్నమైన కథాంశంతో ఈ సినిమా రూపొందిందని చెప్పింది. ఇందులోని విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను అబ్బురపరుస్తాయని పేర్కొంది. ఎత్తైన ప్రదేశాలంటే తనకు చాలా భయమని, అయినప్పటికీ సినిమాలో అలాంటి సన్నివేశాలను ధైర్యంగా పూర్తి చేశానని వివరించింది. నాగచైతన్య మృదుస్వభావి అని, ఆయనతో కలిసి పనిచేయడం సౌకర్యవంతంగా అనిపించిందని మీనాక్షి తెలిపింది. ప్రస్తుతం కార్తీతో కలిసి ఓ సినిమా చేస్తున్నానని, దాని చిత్రీకరణ 60 శాతం పూర్తయిందని వెల్లడించింది. వీటితో పాటు హిందీ, తమిళ భాషల్లోనూ కొన్ని చిత్రాల్లో నటిస్తున్నట్లు చెప్పింది. కార్తీక్ దండు దర్శకత్వం వహించిన 'వృషకర్మ'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.



ముంబైలో 'ధర్మన్'

సూపర్‌స్టార్ రజనీకాంత్ మరో ఆసక్తికరమైన పాత్రతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ధర్మన్' చిత్రంలో ఆయన డాక్టర్‌గా కనిపించనున్నారు. ప్రస్తుతం ముంబయిలో జరుగుతున్న ఈ సినిమా తాజా షెడ్యూల్‌లో రజనీకాంత్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రీకరణకు సంబంధించిన కొన్ని ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. కమల్ హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. సిమ్రన్, రాశీ ఖన్నా, నయనతార కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'జైలర్–2' విజయంతో ఉత్సాహంగా ఉన్న రజనీకాంత్.. 'ధర్మన్'తో మరోసారి తనదైన శైలిలో అలరించేందుకు సిద్ధమవుతున్నారు.



చంద్రశేఖరన్ పునర్నియామకంపై ఉత్కంఠ

- టాటా బోర్డు భేటీకి హైకోర్టు అనుమతి
- సమావేశం వాయిదా వేయాలన్న ట్రస్టుల పిటిషన్లు తిరస్కరణ
- తుది తీర్పునకు లోబడే బోర్డు నిర్ణయాలు

ముంబై: టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పునర్నియామకాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాల్లో సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్, ఆర్‌డీ టాటా ట్రస్టులకు బాంబే హైకోర్టులో తక్షణ ఉపశమనం లభించలేదు. నవంబర్ 30న జరగాల్సిన టాటా సన్స్ బోర్డు సమావేశాన్ని వాయిదా వేయాలన్న వాటి అభ్యర్థనను శుక్రవారం ధర్మాసనం తిరస్కరించింది. షెడ్యూల్ ప్రకారమే సమావేశం నిర్వహించుకోవచ్చని, అందులో తీసుకునే నిర్ణయాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. తదుపరి విచారణను 2027 జనవరి 18కి వాయిదా వేసింది. చంద్రశేఖరన్‌ను మరో ఐదేళ్లపాటు ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కొనసాగించేందుకు సెప్టెంబర్ 17న టాటా సన్స్ బోర్డు తీర్మానించింది. ఈ నిర్ణయం కంపెనీ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్‌లోని ఆర్టికల్ 121కు విరుద్ధమంటూ రెండు ట్రస్టులు నవంబర్ 26న వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశాయి. ట్రస్టుల నామినీ డైరెక్టర్ల మెజారిటీ ఆమోదం లేకుండానే తీర్మానం చేశారని, కాస్టింగ్ ఓటు వినియోగించడం నిబంధనలకు విరుద్ధమని వాదించాయి. పునర్నియామకాన్ని నిలిపివేయాలని, పరిహారం చెల్లించాలని కోరాయి. టాటా సన్స్ తరపున వాదించిన హరీశ్ సాల్వే.. ట్రస్టుల తరపున ఇద్దరు నామినీ డైరెక్టర్లు మాత్రమే ఉన్నందున మెజారిటీ ఓటు సాధ్యం కాదని, అందుకే కాస్టింగ్ ఓటు వినియోగించాల్సి వచ్చిందని తెలిపారు. ఆర్‌బీఐ ఆదేశాల ప్రకారం తప్పనిసరి లిస్టింగ్‌పై డిసెంబర్ 12లోగా నిర్ణయం తెలియజేయాల్సి ఉందని, అందుకే బోర్డు సమావేశం అవసరమని వివరించారు. ఈ వివాదంపై ప్రతివాదులందరూ అఫిడవిట్లు దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. టాటా సన్స్‌లో టాటా ట్రస్టులకు దాదాపు 66 శాతం వాటా ఉంది.

జానూవియాకు పోటీగా 'లుపిన్'


- మధుమేహ చికిత్సకు సిటాగ్లిప్టిన్ టాబ్లెట్ల విడుదల

న్యూఢిల్లీ: ప్రముఖ ఔషధ తయారీ సంస్థ లుపిన్ అమెరికా మార్కెట్లోకి మధుమేహ చికిత్సకు ఉపయోగించే సిటాగ్లిప్టిన్ టాబ్లెట్లను విడుదల చేసింది. అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) అనుమతి లభించడంతో ఈ ఔషధాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు శుక్రవారం వెల్లడించింది. మెర్క్ షార్ప్ అండ్ డోహ్మ్ సంస్థకు చెందిన జానూవియా టాబ్లెట్లకు తమ సిటాగ్లిప్టిన్ ఔషధం జీవ సమానత కలిగి ఉందని లుపిన్ తెలిపింది. టైప్–2 మధుమేహంతో బాధపడుతున్న పెద్దవారిలో రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించేందుకు దీనిని వినియోగిస్తారు. ఐక్యూవీఐఏ 2026 సెప్టెంబర్ గణాంకాల ప్రకారం.. అమెరికాలో జానూవియా బ్రాండ్ సిటాగ్లిప్టిన్ టాబ్లెట్ల వార్షిక విక్రయాలు 2,328.8 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

విమానయాన రంగంలోకి అదానీ?

- ఎయిర్‌లైన్స్‌లో పెట్టుబడులకు కేంద్రం అనుమతి కోరిన గ్రూప్
- దేశంలో రోజుకు 30వేల విమాన సర్వీసులు అవసరమన్న అదానీ సీఎఫ్‌వో
- 2027లో విమానాశ్రయ వ్యాపారం స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్‌కు సిద్ధం

ముంబై: విమానాశ్రయాల నిర్వహణలో కీలకంగా ఉన్న అదానీ గ్రూప్.. విమానయాన రంగంలోనూ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతోంది. ఈ రంగంలో పెట్టుబడులకు అనుమతించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో) జుగేశిందర్ రాబీ సింగ్ వెల్లడించారు. దేశంలో విమాన ప్రయాణాలు చేయగలిగే సామర్థ్యం 60 కోట్ల మందికి ఉందని, ప్రస్తుతం రోజుకు అందుబాటులో ఉన్న విమాన సర్వీసుల సంఖ్యను పదిరెట్లు పెంచి 30వేలకు చేర్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ముంబైలో శుక్రవారం జరిగిన ఇండియా డెట్ క్యాపిటల్ మార్కెట్ సదస్సులో ఆయన మాట్లాడారు. విమానయాన రంగంలో పెట్టుబడులకు అనుమతి లభిస్తే.. విమానయాన సంస్థలకు నిధులు సమకూర్చడం, ఇతర సంస్థల్లో పెట్టుబడులు పెట్టడం లేదా కొత్తగా ఈ రంగంలోకి రావాలనుకునే వారికి సహకరించడం వంటి అవకాశాలను పరిశీలిస్తామని సింగ్ తెలిపారు. అయితే, విమానయాన సంస్థను సొంతంగా ప్రారంభించే ప్రతిపాదనపై అదానీ గ్రూప్ గతంలో స్పష్టత ఇచ్చింది. విమానాశ్రయాల నిర్వహణ సంస్థలు విమానయాన సేవలు నిర్వహించడంపై కేంద్రం కొన్ని పరిమితులు ఉన్నప్పటికీ, సాధారణంగా నిషేధం లేదని ఆగస్టులో పార్లమెంటుకు వెల్లడించింది.



వచ్చే ఏడాది లిస్టింగ్‌కు సన్నద్ధం

అదానీ గ్రూప్ విమానాశ్రయ వ్యాపారం 2027లో స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్‌కు సిద్ధమవుతుందని సింగ్ చెప్పారు. ఐపీఓకు వెళ్లాలా? లేక ఇతర పునర్వ్యవస్థీకరణ మార్గాన్ని ఎంచుకోవాలా? అన్నది సంబంధిత బోర్డులు నిర్ణయిస్తాయని తెలిపారు. ప్రస్తుతం విమానాశ్రయ వ్యాపార ఆదాయంలో విమానయానేతర కార్యకలాపాల వాటా 60 శాతంగా ఉందని, వచ్చే ఆరు నుంచి తొమ్మిది నెలల్లో ఇది 60–65 శాతానికి చేరవచ్చని అంచనా వేశారు. దేశీయ విమానయాన రంగంలో ప్రస్తుతం ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలదే ప్రధాన ఆధిపత్యం. ఈ రెండు సంస్థలు కలిపి దాదాపు 90 శాతం ప్రయాణికుల రాకపోకలను నిర్వహిస్తున్నాయి. జెట్ ఎయిర్‌వేస్, గో ఫస్ట్ మూతపడటం, విస్తారా, ఎయిర్ ఏషియా ఇండియా విలీనంతో పోటీ తగ్గింది. ఈ నేపథ్యంలో మరిన్ని విమానయాన సంస్థల అవసరం ఉందన్న చర్చకు ప్రాధాన్యం పెరిగింది. అదానీ గ్రూప్ ప్రస్తుతం ముంబయి, నవీ ముంబయి, అహ్మదాబాద్, లఖ్‌నవూ, జైపూర్, గువాహటి, తిరువనంతపురం, మంగళూరు విమానాశ్రయాలను నిర్వహిస్తోంది. వీటి ద్వారా దేశంలోని మొత్తం విమాన ప్రయాణికుల రాకపోకల్లో నాలుగో వంతుకు పైగా సేవలు అందిస్తోంది.

లాభాల స్వీకరణతో మార్కెట్లకు భారీ నష్టం

- 989 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి.. 25,600 దిగువకు నిఫ్టీ
- రెండు రోజుల లాభాలకు బ్రేక్.. ఒక్కరోజే భారీ పతనం
- పెరిగిన ముడిచమురు ధరలు, బలహీనపడిన రూపాయి ప్రభావం
- సెన్సెక్స్‌లో హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, టీసీఎస్ భారీ నష్టాలు
- వారంలోనూ నష్టాలతో ముగిసిన సూచీలు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండు రోజుల లాభాలకు బ్రేక్ వేశాయి. ఐటీ, బ్యాంకింగ్ రంగాల షేర్లలో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం, అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడం ప్రతికూల ప్రభావం చూపాయి. దీంతో శుక్రవారం సెన్సెక్స్ 989 పాయింట్లు పతనమైంది. నిఫ్టీ కూడా 25,600 స్థాయికి దిగువన ముగిసింది. 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 989.33 పాయింట్లు (1.17 శాతం) నష్టపోయి 83,339.26 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఒక దశలో 1,120.26 పాయింట్లు (1.32 శాతం) క్షీణించి 3,208.33కు పడిపోయింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 277.30 పాయింట్లు (1.07 శాతం) తగ్గి 25,607.20 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, బజాజ్ ఫిన్‌సర్వ్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. మరోవైపు భారత్ ఎలక్ట్రానిక్స్, టైటన్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, టాటా స్టీల్, పవర్‌గ్రిడ్, ట్రెంట్ షేర్లు లాభపడ్డాయి. ఎస్ఈ రంగాల వారీ సూచీల్లో ఐటీ 1.53 శాతం, ఫోకస్డ్ ఐటీ 1.38 శాతం, రియల్టీ 1.35 శాతం, ఆటో 1.28 శాతం, ఆర్థిక సేవలు 1.02 శాతం, ప్రైవేటు బ్యాంకులు ఒక శాతం చొప్పున నష్టపోయాయి. క్యాపిటల్ గూడ్స్, కమోడిటీస్, పారిశ్రామిక, టెలికాం, మెటల్ రంగాలు లాభాల్లో ముగిశాయి.

పెరిగిన ముచమురు ధరలు

అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధర 0.76 శాతం పెరిగి బ్యారెల్‌కు 97.22 డాలర్లకు చేరింది. మధ్యప్రాచ్యంలో మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంతో సరఫరాపై ఆందోళనలు నెలకొన్నాయని, ఇది దేశీయ ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపవచ్చని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ పరిశోధన విభాగం అధిపతి వినోద్ నాయర్ తెలిపారు. ముడిచమురు ధరల పెరుగుదల, రూపాయి బలహీనత, బాండ్ల రాబడులు పెరగడం కూడా మదుపర్ల లాభాల స్వీకరణకు కారణమయ్యాయని పేర్కొన్నారు.

వారంలోనూ నష్టాలే

వారాంతపు లెక్కల్లోనూ సూచీలు నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 580.45 పాయింట్లు (0.69 శాతం), నిఫ్టీ 193.4 పాయింట్లు (0.74 శాతం చొప్పున) తగ్గాయి. గురువారం విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) రూ.5,843.33 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేసినట్లు ఎక్స్ఛేంజీల గణాంకాలు వెల్లడించాయి. భారత మార్కెట్లు నష్టపోయిన పటికీ ఆసియాలో ప్రధాన సూచీలు లాభాల్లో ముగిశాయి. దక్షిణ కొరియా కోస్పి 4.34 శాతం, షాంఘై సూచీ 3.73 శాతం, జపాన్ నిక్కీ 2.11 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 2.11 శాతం చొప్పున పెరిగాయి. యూరప్ మార్కెట్లు కూడా లాభాల్లో ట్రేడయ్యాయి. థాంక్స్‌గివింగ్ సెలవు కారణంగా గురువారం అమెరికా మార్కెట్లు పనిచేయలేదు.



ఇక ధరలన్నీ బహిరంగమే

- భారీ టెలికాం సంస్థలకు ట్రాయ్ కొత్త ఆదేశాలు

న్యూఢిల్లీ: టెలికాం రంగంలో పారదర్శకత, సమాన అవకాశాలు పెంచేందుకు భారత టెలికాం నియంత్రణ సంస్థ (ట్రాయ్) కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. మార్కెట్‌లో 30 శాతం లేదా అంతకంటే ఎక్కువ వాటా కలిగిన టెలికాం సంస్థలు ఇతర నెట్‌వర్క్‌లకు సేవలు అందించేందుకు సంబంధించిన ధరలు, నిబంధనలను బహిరంగంగా ప్రకటించాలని ఆదేశించింది. ఈ మేరకు సవరించిన నిబంధనలను శుక్రవారం విడుదల చేసింది. ఇవి 2027 జనవరి నుంచి అమల్లోకి రానున్నాయి. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయం, చందాదారుల సంఖ్య, వాయిస్ కాల్స్ నిర్వహణ సామర్థ్యం, డేటా ట్రాఫిక్ పరిమాణం.. ఈ నాలుగు అంశాల్లో ఏదో ఒకదానిలో 30 శాతం లేదా అంతకంటే ఎక్కువ వాటా ఉన్న సంస్థను 'సిగ్నిఫికెంట్ మార్కెట్ పవర్' (ఎస్ఎంపీ) కలిగిన సంస్థగా గుర్తిస్తారు. అలాంటి సంస్థలు ట్రాయ్ గుర్తింపు పొందిన 30 రోజుల్లోగా రిఫరెన్స్ ఇంటర్‌కనెక్ట్ ఆఫర్ (ఆర్ఐఓ)ను ఆమోదం కోసం సమర్పించాలి. ఆమోదం పొందిన 15 రోజుల్లోగా వెబ్‌సైట్‌లో ప్రచురించాలి. గడువులోగా ఆర్ఐఓను ప్రచురించకపోతే రూ.25 లక్షల వరకు, ఇతర కీలక వివరాలను వెల్లడించకపోతే మరో రూ.15 లక్షల వరకు జరిమానా విధిస్తారు.

బిమ్స్‌టెక్ అథ్లెటిక్స్‌లో భారత్ టాప్

- 47 పతకాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానం
- చివరి రోజు ఎనిమిది స్వర్ణాలు
- నాలుగు రిలే విభాగాల్లోనూ పసిడి పతకాలు
- 38 పతకాలతో రెండో స్థానంలో శ్రీలంక

భువనేశ్వర్: తొలి బిమ్స్‌టెక్ అండర్–23 అథ్లెటిక్స్ పోటీల్లో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో 22 స్వర్ణాలు, 13 రజతాలు, 12 కాంస్యాలతో కలిపి మొత్తం 47 పతకాలు సాధించి విజేతగా నిలిచింది. శుక్ర వారంతో ముగిసిన పోటీల చివరి రోజున భారత్ మరో ఎనిమిది స్వర్ణాలను ఖాతాలో వేసుకుంది. శ్రీలంక 38 పతకాలతో రెండో స్థానంలో నిలవగా.. బంగ్లాదేశ్ 10 పతకా లతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. నేపాల్‌కు ఒక కాంస్యం లభించగా.. భూటాన్, మయన్మార్ ఒక్క పతకం కూడా గెలవలేకపోయాయి. చివరి రోజు జరిగిన 14 స్వర్ణ పతకాల పోటీల్లో శ్రీలంక ఆరు స్వర్ణాలు సాధించింది. మహిళల 200 మీటర్ల పరుగులో ఆ దేశానికి చెందిన కె. హిసానా నిరుపమ (24.08 సెకన్లు) భారత అథ్లెట్ భావన జి (24.23)ను వెనక్కి నెట్టి స్వర్ణం గెలుచుకుంది. పురుషుల 200 మీటర్లలో ఎం. థిమేష్ చాన్ కోస్టా (21.23 సెకన్లు) విజయం సాధించి స్ప్రింట్ డబుల్ పూర్తి చేశాడు. భారత అథ్లెట్ యువరాజ్ ఇ (21.49) రజతంతో సరిపెట్టుకున్నాడు. పురుషుల 400 మీటర్లలో ముతునాయకగే చతురంగ (49.90 సెకన్లు), మహిళల 400 మీటర్లలో అరళియా సత్సర్ గీగనగే (59.38) శ్రీలంకకు స్వర్ణాలు అందించారు. మహిళల 800 మీటర్లలో లక్షణి వత్తే గెదర (2:10.17) ఇద్దరు భారత అథ్లెట్లను అధిగమించి విజేతగా నిలిచింది. పురుషుల లాంగ్‌జంప్‌లో ఏపీ కృష్ణందన్ (7.53 మీటర్లు), కేఎంకేసీ కరుణరత్న (7.43) తొలి రెండు స్థానాలను కైవసం చేసుకున్నారు.


షాట్‌పుట్, 800 మీటర్లలో భారత్‌కు స్వర్ణాలు

మహిళల షాట్‌పుట్‌లో అన్ను 15.17 మీటర్ల దూరం విసిరి స్వర్ణం సాధించింది. రియా వర్మ 14.59 మీటర్లతో రజతం గెలిచి భారత్‌కు రెండు పతకాలు అందించింది. పురుషుల 800 మీటర్ల పరుగులో శ్యామ్ మిలన్ బింద్ 1:50.66 నిమిషాల్లో లక్ష్యాన్ని చేరి స్వర్ణం సాధించాడు. 4x100 మీటర్లు, 4x400 మీటర్ల పురుషుల, మహిళల రిలేల్లో నూ భారత్ స్వర్ణాలు గెలుచుకుంది. ముఖ్యంగా 4x400 మీటర్ల రెండు విభాగాల్లోనూ వెనుకబడిన స్థితి నుంచి పుంజుకుని శ్రీలంకను ఓడించడం విశేషం. మహిళల 4x100 మీటర్ల రిలేలో చివరి అథ్లెట్‌గా పరుగెత్తిన మృత్తిక టి, తను చౌధరి ఈ పోటీల్లో రెండేసి స్వర్ణాలు సాధించిన మహిళా అథ్లెట్లుగా నిలిచారు. జావెలిన్ త్రోలో శశాంక్ పాటిల్ 71.89 మీటర్ల దూరం విసిరి భారత్‌కు మరో స్వర్ణం అందించాడు. ఒడిశా ముఖ్యమం త్రి మోహన్ చరణ్ మాఝీ పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తొలి అంతర్జాతీయ టోర్నీలోనే పతకం

- బ్యాడ్మింటన్ ఆసియా సీనియర్ చాంపియన్‌షిప్‌లో ప్రతానా థాపాకు కాంస్యం

న్యూఢిల్లీ: నాగాలాండ్‌కు చెంది న బ్యాడ్మింటన్ క్రీడాకారిణి ప్ర తానా థాపా అంతర్జా తీయ అరంగేట్రాన్ని పతకంతో ఘ నంగా చాటుకుంది. దక్షిణ కొ రియాలోని గ్వాంగ్జులో నవంబ ర్ 16 నుంచి 22 వరకు జరిగి న బ్యాడ్మింటన్ ఆసియా సీని యర్ చాంపియన్‌షిప్–2026 లో మహిళల డబుల్స్ 40 ప్లస్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించింది. మిజోరంకు చెం దిన లాల్‌డుహ్జువాలితో కలిసి బరిలోకి దిగిన ప్రతానా.. సెమీ ఫైనల్ వరకు చేరి పతకాన్ని ఖా యం చేసుకుంది. తొలి అంత ర్జాతీయ టోర్నీలోనే పతకం సా ధించడం ఆమె ప్రతిభకు నిదర్శ నం. ప్రతానా థాపా భారత ఆడిట్, అకౌంట్స్ విభాగంలో



సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తోంది. ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే బ్యాడ్మిం టన్‌లోనూ తన ప్రతిభను చాటుతోంది. గత మార్చిలో గోవాలో జరిగిన 48వ ఇండియన్ మాస్టర్స్ (వెటరన్) జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో మహిళల డబుల్స్ 40 ప్లస్ విభాగంలో రజత పతకం సాధించింది. ఆ పోటీల్లో టాప్ సీడ్ జోడీని ఓడించి ఫైనల్‌కు చేరింది. వరుస గాయాల కారణంగా కొంతకాలం ఆటకు దూరమైన ప్రతా నా.. వాటి నుంచి కోలుకుని తిరిగి కోర్టులో అడుగుపెట్టింది. తొలి అంతర్జాతీయ టోర్నీ లోనే పతకం సాధించడం తనకెంతో ప్రత్యేకమని ఆమె పేర్కొంది. గాయాల తర్వాత మళ్లీ ఈ స్థాయిలో ఆడగలనా అనే సందేహాలు కలిగాయని, ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై పతకం సాధించడం మాటల్లో చెప్పలేనంత ఆనందాన్నిస్తోందని తెలిపింది. తనను నమ్మి ప్రోత్సహించిన కుటుంబ సభ్యులకు, నాగాలాండ్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపింది. బ్యాడ్మింటన్ ఆసియా ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నీలో ఆసియా, ఓషియా నియా ప్రాంతాలకు చెందిన సీనియర్ షట్లర్లు పాల్గొన్నారు.



ఆకాశ్‌దీప్ అదరహో!

భారత్ పేసర్ ధాటికి కివీస్ టాప్ ఆర్డర్ విలవిల

- రెండో టెస్టు తొలి రోజు నాలుగు వికెట్లు కోల్పోయిన ఆతిథ్య జట్టు
- అర్ధ శతకాలతో ఆకట్టుకున్న లాథమ్, బ్లండెల్

క్రైస్ట్‌చర్చ్: వెన్ను గాయం నుంచి కోలుకుని జాతీయ జట్టులోకి పునరాగమనం చేసిన భారత పేసర్ ఆకాశ్‌దీప్ అదరగొట్టాడు. తన పదునైన బంతులతో న్యూజిలాండ్ బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఒక దశలో వికెట్ నష్టపో కుండా 77 పరుగులతో పటిష్ఠంగా కనిపించిన ఆతిథ్య జట్టును 110 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయేలా చేశాడు. అయితే ఐదో వికెట్‌కు డారిల్ మిచెల్‌తో కలిసి టా మ్ బ్లండెల్ జట్టును ఆదుకోగా.. ఆ తర్వాత గ్లెన్ ఫిలిప్స్‌తో కలిసి మరో కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. దీంతో రెండో టెస్టు తొలిరోజు శుక్రవారం ఆట ముగిసే సమయా నికి న్యూజిలాండ్ 85 ఓవర్లలో ఐదు వికెట్లకు 246 పరు గులు చేసింది. బ్లండెల్ (53 బ్యాటింగ్), ఫిలిప్స్ (36 బ్యా టింగ్) క్రీజులో ఉన్నారు. ఆకాశ్‌దీప్ రెండు వికెట్లు పడగొ ట్టగా.. గుర్నూర్ బ్రార్, అన్షుల్ కాంబోజ్, వాషింగ్టన్ సుం దర్ తలో వికెట్ తీశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు ఓపెనర్లు టామ్ లాథమ్ (59), డెవాన్ కాన్వే (31) శుభారంభం అందించారు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ తొలి వికెట్‌కు 77 పరుగులు జోడించారు. బుమ్రా వేసిన తొలి ఓవర్లోనే ఎల్బీడబ్ల్యూగా లాథమ్‌ను అంపైర్ ప్రకటించినప్పటికీ.. డీఆర్ఎస్‌తో అతడు బతికిపోయాడు. తొలి గంట ఆట తర్వాత పిచ్‌పై బ్యాటింగ్ సులువైంది. కాన్వే డ్రైవ్‌లు, కట్ షాట్లతో ఆకట్టుకున్నాడు. అయితే లంచ్ విరామానికి ముందు చివరి బంతికి అరంగేట్ర బౌలర్ గుర్నూర్ బ్రార్ కాన్వేను ఔట్ చేసి భారత్‌కు తొలి వికెట్ అందించాడు.

110 పరుగులకే కివీస్ నాలుగు వికెట్లు

భోజన విరామం తర్వాత ఆకాశ్‌దీప్ బంతితో చెలరేగాడు. సెమీ న్యూ కూకబుర్రా బంతితో అద్భుతమైన స్వింగ్, సీమ్ కదలికలు రాబడుతూ ప్రత్యర్థి బ్యాటర్లను పరీక్షించాడు. అప్పటికే క్రీజులో కుదురుకున్న లాథమ్‌ను అద్భుతమైన బంతితో బోల్తా కొట్టించాడు. పిచ్‌పై పడి నేరుగా వచ్చిన బంతి లాథమ్ బ్యాట్ అంచును తాకగా.. వికెట్ కీపర్ రిషభ్ పంత్ క్యాచ్ అందుకున్నాడు. ఆ తర్వాత హెన్రీ నికోల్స్ (16)ను అన్షుల్ కాంబోజ్ పెవిలియన్‌కు పం పాడు. కొద్దిసేపటికే రచిన్ రవీంద్ర (0)ను ఆకాశ్‌దీప్ పంత్ చేతికి చిక్కేలా చేశాడు. దీంతో 110 పరుగులకే కివీ స్ నాలుగు వికెట్లు కోల్పోయింది. ఆకాశ్‌దీప్ 21 ఓవర్లు వేసి 52 పరుగులిచ్చి రెండు వికెట్లు సాధించాడు. మరోవై పు కష్టాల్లో ఉన్న జట్టును డారిల్ మిచెల్ (31), బ్లండెల్ ఆదుకున్నారు. ఐదో వికెట్‌కు 74 పరుగులు జోడించి జట్టును గట్టెక్కించే ప్రయత్నం చేశారు. అయితే మిచెల్‌ను వాషింగ్టన్ సుందర్ ఔట్ చేయడంతో ఈ భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం బ్లండెల్‌కు ఫిలిప్స్ అండగా నిలిచాడు. భారత బౌలర్లను ఆచితూచి ఎదుర్కొంటూ పరు గులు సాధించారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు అజేయంగా 62 పరుగులు జోడించారు. 117 బంతులు ఎదుర్కొన్న బ్లండెల్ అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా.. ఫిలిప్స్ 64 బంతు ల్లో 36 పరుగులతో క్రీజులో ఉన్నాడు.

బుమ్రా పొదుపైన బౌలింగ్

భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వికెట్ సాధించకపో యినా పరుగులు ఇవ్వకుండా కట్టడి చేశాడు. 19 ఓవర్ల బౌలింగ్ చేసి కేవలం 37 పరుగులే ఇచ్చాడు. మరోవైపు గుర్నూర్ బ్రార్ అరంగేట్రంతో భారత పేస్ విభాగానికి అదనపు బలం చేకూరింది. హ్యాగ్లీ ఓవల్ మైదానంలోని పిచ్ బౌన్స్, సీమ్ కదలికలకు అనుకూలించడంతో బౌలర్ల



కు అవకాశాలు లభించాయి. తొలి, చివరి సెషన్లలో న్యూజిలాండ్ ఆధిపత్యం ప్రదర్శించగా.. రెండో సెషన్‌లో భారత బౌలర్లు పైచేయి సాధించారు. దీంతో తొలి రోజు ఆటలో ఇరు జట్లూ సమానంగా నిలిచాయి.

ముంబై పగ్గాలు మళ్లీ హిట్‌మ్యాన్‌కే

మూడేళ్ల విరామం తర్వాత కెప్టెన్‌గా రోహిత్ శర్మ పునరాగమనం

- హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు ట్రేడ్
- కొత్త కోచింగ్ బృందంతో 2027 సీజన్‌కు ముంబై ఇండియన్స్ సిద్ధం



ముంబై: ఐపీఎల్‌లో ఐదుసార్లు ముంబై ఇండియన్స్‌కు టైటిల్ అందించిన రోహిత్ శర్మకు ఆ జట్టు యాజమా న్యం మరోసారి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. 2027 సీజన్‌కు ముందు హార్దిక్ పాండ్యా స్థానంలో రోహిత్‌ను తిరిగి సారథిగా నియమించింది. మూడేళ్ల విరామం తర్వాత అతడు మళ్లీ జట్టును నడిపించను న్నాడు. హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ ద్వారా పంజాబ్ కింగ్స్‌కు వెళ్లడంతో ముంబై ఈ నిర్ణయం తీసుకుంది. ఐపీఎల్ 20వ సీజన్‌తో పాటు ముందున్న సవాళ్లకు సిద్ధంగా ఉన్నానని రోహిత్ తెలిపాడు. అభిమానులకు మరిన్ని ఆనంద క్షణాలు అందించడమే తమ లక్ష్యమ ని పేర్కొన్నాడు. సమష్టిగా ఆడుతూ, ఆటను ఆస్వాది స్తూ విజయాల కోసం పోటీపడతామని ఓ ప్రకటనలో వెల్లడించాడు. ముంబై ఇండియన్స్ తన జీవితంలో ప్ర త్యేకమైన భాగమని, ఆ జట్టుకు నాయకత్వం వహించ డం ఎప్పుడూ గర్వకారణమని చెప్పాడు.

ఐదు టైటిళ్లు అందించిన కెప్టెన్

2013లో ముంబై ఇండియన్స్ సారథిగా బాధ్యతలు చేపట్టిన రోహిత్.. అదే ఏడాది జట్టుకు తొలి ఐపీఎల్ టైటిల్ అందించాడు. ఆ తర్వాత 2015, 2017, 2019, 2020లోనూ జట్టును విజేతగా నిలిపి మొత్తం ఐదు టైటిళ్లు సాధించాడు. 2013లో ఛాంపియన్స్ లీ గ్ టీ20 ట్రోఫీని కూడా అందించాడు. అయితే 2023 సీజన్ తర్వాత అతడిని కెప్టెన్సీ నుంచి తప్పించి హార్దిక్ పాండ్యాకు పగ్గాలు అప్పగించారు.

ఆ తర్వాత ముంబై ప్రదర్శ నలో ఆశించిన స్థాయిలో నిలకడ కనిపించలే దు. 2024లో పదో స్థానానికి పరిమితమైన జట్టు.. 2025లో క్వాలిఫయర్–2లోనే నిష్క్రమించింది. 2026 సీజన్‌లో తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకుంది. వరుసగా మూడోసారి టైటిల్ దక్కకపోవడంతో జట్టు యాజమాన్యం మార్పులపై దృష్టి సారించింది. హార్దిక్ ను ట్రేడింగ్‌లో పంపించేందుకు గుజరాత్ టైటాన్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ సహా పలు జట్లతో చర్చలు జరిపింది. చివరకు పంజాబ్ కింగ్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది.

కొత్త కోచింగ్ బృందం

రోహిత్‌తో పాటు సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, తిలక్ వర్మ పేర్లను కూడా కెప్టెన్సీ కోసం పరిశీలించినట్లు సమాచారం. చివరకు జట్టుకు ఐదు టైటిళ్లు అందించిన రోహిత్ వైపే యాజమాన్యం మొగ్గుచూపింది. అతడు తిరిగి నాయకత్వ బాధ్యతలు చేపట్టడం ప్రత్యేకమైన సందర్భమని జట్టు యజమాని నీతా అంబానీ పేర్కొన్నారు. రోహిత్ సారథ్యంలో మరిన్ని విజయాలు సాధిస్తామని ఆకాంక్షించారు. ఆ కాష్ అంబానీ కూడా అతడి పునరాగమనంపై హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు కోచింగ్ బృందంలోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. మహేల జయవర్ధనే స్థానంలో కీరన్ పొలార్డ్ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. రాబిన్ ఉతప్ప బ్యాటింగ్ కోచ్‌గా, న్యూజిలాండ్‌కు చెందిన మిచెల్ మెక్లెనగన్ బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించనున్నారు. భారత మాజీ ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్ ఫీల్డింగ్ విభాగాన్ని పర్యవేక్షిస్తాడు.

ఐపీఎల్‌లో రెండో అత్యధిక పరుగులు

రోహిత్ ఇప్పటివరకు 281 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడి 7,329 పరుగులు చేశాడు. ఇందులో రెండు శతకా లు, 49 అర్ధశతకాలు ఉన్నాయి. అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో విరాట్ కోహ్లీ (9,336) తర్వాత రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. కెప్టెన్‌గా 158 మ్యాచ్‌ల్లో జట్టును నడిపించి 87 విజయాలు అందించాడు. మొత్తం టీ20ల్లో 220 మ్యాచ్‌లకు నాయకత్వం వహించి 140 విజయాలు సాధించాడు. అత్యధిక విజయాల రికార్డు ధోనీ పేరిట ఉంది.



టైటిల్‌కు అడుగు దూరంలో భారత్

- మహిళల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ ఫైనల్లోకి డిఫెండింగ్ చాంపియన్
- మలేసియాపై 6–2తో ఘన విజయం

భోపాల్: మహిళల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీలో డిఫెండింగ్ చాంపియన్ భారత్ మరోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన సెమీఫై నల్లో మలేసియాను 6–2తో చిత్తు చేసింది. టోర్నీలో ఆరోసారి తుదిపోరుకు అర్హత సాధించింది. టాప్ స్కోరర్ దీపిక రెండు గోల్స్‌తో మెరవగా.. ముంతాజ్ ఖాన్, నవనీత్ కౌర్, సునెలితా టొప్పో, ఇషిక తలో గోల్ సాధించారు. మలేసియా తరఫున నూర్ అ జర్, నూరామిరా జుల్కిఫ్లీ చెరో గోల్ చేశారు. శనివా రం జరిగే ఫైనల్లో చైనాతో భారత్ తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే నాలుగోసారి టైటిల్ సాధించిన జట్టుగా రికార్డు సృష్టిస్తుంది. భారత్ ఆరంభం నుం చే దూకుడుగా ఆడింది. మిడ్‌ఫీల్డ్‌లో బంతిని నియం త్రిస్తూ ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై దాడులు చేసింది. మలే సియా కూడా కుడివైపు నుంచి భారత దాడులను అడ్డుకునేందుకు ప్రయత్నించింది. తొలి క్వార్టర్ చివర్లో సునెలితా సాధించిన పెనాల్టీ కార్నర్ భారత్‌కు అవకాశమిచ్చింది. దీపిక తొలి ప్రయత్నం విఫల మైనా.. రీబౌండ్‌ను అందుకున్న సునెలితా తెలివిగా బంతిని ముంతాజ్‌కు అందించింది. ఆమె సమీపం నుంచి గోల్ చేసి 10వ నిమిషంలో భారత్‌కు ఆధి క్యం అందించింది. రెండో క్వార్టర్‌లో భారత దాడు లు మరింత పదునెక్కాయి. 18వ నిమిషంలో నవనీ త్ కౌర్ ఇద్దరు మలేసియా డిఫెండర్లను తప్పించు కుని గోల్ కీపర్‌ను బోల్తా కొట్టించింది. 25వ నిమి షంలో దీపిక పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచింది. 27వ నిమిషంలో నూర్ అజర్ పెనాల్టీ కార్నర్‌తో మలేసియాకు తొలి గోల్ అందించింది. అయితే 30వ నిమిషంలో దీపిక మరో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి భారత్ ఆధిక్యాన్ని 4–1కి పెంచింది. మూడో క్వార్టర్ ఆరంభంలోనే భారత్ ఐదో గోల్ సాధించింది.

Printed, published and owned by Adula Thirupathi, printed at Ramani web offset printers, H.NO 8-82/11/1,Auto Nagar, Bommakal Road, village, mdl & Dist : Karimnagar 505001,Telangana,
Published from, 8-1-141, Giddheperumandla Nagar Road, Karimnagar, Telangana, **Editor : Gaddam Ravi.** Email: vemulawadavaartha@gmail.com. RNI NO. TEL TEL /2017/71143